నేటి కందం- నేటికి అందం

చేతడిగ స్వామినాథను
ఖ్యాతి నొసగె జాతి కనుచు ఘనుడగు మోడీ
ప్రీతిని గొలిపెడి యంత
ర్జాతీయ సదస్సులోన చక్కగ నుడివెన్ !!

(వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ శతజయంతి సందర్భంగా జరిగిన అంతర్జాతీయ సదస్సులో మోడీ పాల్గొని ఆయన జాతికి చేసిన సేవలను కొనియాడారు)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

బీసీ కోట కొరకు ధర్నా
ప్రభుత చేసె ఢిల్లి వెళ్లి
కేంద్రమొప్పుకుంటుందా
కనికరిస్తూ రాష్ట్ర లొల్లి
కక్కలేక మింగలేక
కొట్లాడే హస్త గళం
ద్వంద్వనీతి జిత్తులతో
దారితప్పె కమలదళం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 8-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:5 పేజీలు:6 వెల: రూ.1/-

# జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం

## -అదుపుతప్పిన CRPF వాహనం లోయలోకి దూసుకెళ్లి ముగ్గురు జవాన్లు మృతి



ఉధంపూర్ ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. గురువారం కద్వా బసంత్‌గఢ్ ప్రాంతంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సిబ్బందిని తీసుకెళ్తున్న వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు మరణించగా, 15 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. 187వ బెటాలియన్‌కు చెందిన జవాన్ల బృందం బసంత్ ఘర్ నుండి ఆపరేషన్ ముగించుకుని తిరిగి వస్తుండగా ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటినా సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల..

ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఆగస్టు 21 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, ఆగస్టు 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది.

ఆగస్టు 25 నామినేషన్ల ఉపసంహరణ , సెప్టెంబర్ 9పోలింగ్ నిర్వహించి అదే రోజున ఓట్ల లెక్కింపు చేపడుతారు. ఇక ఈ ఎన్నికలో రాజ్యసభ, లోక్‌సభకు చెందిన సభ్యులు ఓటర్లుగా ఉంటారని పేర్కొంది. రాజ్యసభకు నామినేట్ అయినవారు కూడా ఓటు వేయవచ్చని తెలిపింది. రాజ్యసభ లో 233 మంది ఎన్నికైన సభ్యులు 12 మంది నామినేటెడ్ సభ్యులుండగా, లోక్‌సభ లో 543 మంది, మొత్తం 788 మంది ఓటర్లు. ప్రస్తుతం రాజ్యసభలో ఐదు, లోక్‌సభలో ఒక స్థానం ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ఎన్నికలో 782 మంది ఓటు వేయనున్నారు. అందరూ ఓటు వేస్తే గెలిచే అభ్యర్థికి 391 ఓట్లు అవసరమవుతాయి.

# బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోంది.. : రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ, ఆగస్టు 7:తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలుపాలని డిమాండ్ చేస్తూ.. కాంగ్రెస్ నేతలు అందరూ ఢిల్లీ వెళ్లిన సంగతి తెలిసిందే. నిన్న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. అయితే నిన్న మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఇవాళ(గురువారం) మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా మోదీ, అమిత్‌షా అడ్డుకున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దక్కకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎప్పుడూ అన్యాయం చేస్తూనే ఉందని విమర్శించారు. రిజర్వేషన్లపై బీజేపీ నేతలు వితండవాదం చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్(ఃఖీూ) శిఖండి పాత్ర పోషిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి ధర్నాలో బీఆర్ఎస్ ఎందుకు పాల్గొనలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ధర్నాలో పాల్గొనకపోగా అవహేళన చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు.

కులగణన వివరణ..

కులగణనలో సంపూర్ణ వివరాలు సేకరించామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. బీసీ జనాభా లెక్కలు తెలుసుకునేందుకే కులగణన చేసినట్లు తెలిపారు. ఆ తరువాతే.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించామన్నారు. రాహుల్ గాంధీ హామీ మేరకు బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నామని స్పష్టం చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో..42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రెండు బిల్లులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని ఃఖీూ చట్టం చేసిందని, చేసిన చట్టాన్ని అధిగమించేందుకే ఆర్డినెన్స్ తీసుకొచ్చినట్లు చెప్పారు. 4 నెలలు గడుస్తున్నా బిల్లులను రాష్ట్రపతి ఆమోదించలేదని అసహనం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం క్షేత్రస్థాయిలో అన్ని ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. శాసనసభలో ఏకగ్రీవ ఆమోదంతోనే చట్టాలను ఢిల్లీకి పంపామని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై జాతీయ స్థాయిలో పోరాడాలనే ఢిల్లీకి వచ్చామని రేవంత్ వెల్లడించారు.

మద్దతుకు ధన్యవాదాలు ..

నిన్నటి ధర్నాకు 100 మందికిపైగా ఎంపీలు మద్దతు ప్రకటించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే.. ధర్నాకు మద్దతు తెలిపిన డీఎంకే, ఎన్సీపీ ఎస్పీ ఇతర పార్టీల నేతలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. కులగణన మోడల్‌ను రాహుల్, ఖర్గే ప్రశంసించారని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు అందరూ జంతర్ మంతర్ నిరసన కార్యక్రమంలో కులాలకు అతీతంగా పాల్గొన్నారని తెలిపారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని అమలు చేస్తున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు.

కిషన్ రెడ్డికి కౌంటర్..

ధర్నాకు రాహుల్, ఖర్గే రాకపోవడంపై గల్లీ లీడర్లలా కిషన్‌రెడ్డి మాట్లాడటం సరికాదన్నారు. కులగణన సర్వేపై కిషన్‌రెడ్డికి ప్రెజెంటేషన్ ఇస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డి డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చేస్తే.. కిషన్‌రెడ్డి అనుమానాలను అధికారులు నివృత్తి చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు.

# పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## -టిపిసిసి అధికార ప్రతినిధి వెదిరె యోగేశ్వర్ రెడ్డి

## -అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఘనంగా "రేషన్ కార్డులు పంపిణీ"



మహేశ్వరం ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )మహేశ్వరం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి "రేషన్ కార్డులు పంపిణీ" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గౌరవ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు (ఐటీ, పరిశ్రమలు ఎలక్ట్రానిక్స్, శాసనసభ వ్యవహారాల శాఖ) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో కలిసి టిపిసిసి అధికార ప్రతినిధి వెదిరె యోగేశ్వర్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా యోగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదల సంక్షేమమే లక్ష్యంగా నడుస్తున్న ఈ ప్రభుత్వం, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఈ దిశగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలు రాయిగా నిలుస్తోంది.ప్రజల అభిమానం చూసి ఓర్వలేని కొంతమంది ప్రతిపక్ష నాయకులు, శాసనసభ్యులు రాజకీయ స్వార్థంతో నిరుత్సాహపర్చే ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ప్రజలను విస్మరించిన వారు ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమం చుట్టూ జరుగుతున్న మార్పును చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం సంకల్పబలంతో, ప్రజల మద్దతుతో పేదల పక్షాన నిలబడి, ప్రతి కుటుంబానికి అండగా ఉండే నూతన తెలంగాణ నిర్మాణం వైపు వేగంగా కదులుతుందన్నారు.

# నగరంలో కుండపోత వర్షం..

హైదరాబాద్, ఆగస్టు 7: హైదరాబాద్ నగర వ్యాప్తంగా వాన దంచికొడుతుంది. గత రెండు మూడు రోజుల నుంచి ఉక్కపోతకు గురైన నగర ప్రజలకు ఈ భారీ వర్షంతో కాస్త ఉపశమనం కలిగింది. అయితే ప్రయాణికులకు, వాహనదారులకు మాత్రం ఇబ్బందులు తెచ్చిపెట్టింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ పరిస్థితుల దృష్ట్యా ఎమర్జెన్సీ బృందాలు రంగంలోకి దిగాయి.

అబిడ్స్, లక్డీకాపూల్, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్, సోమాజిగూడ, ఖైరతాబాద్, బేగంపేట్, సికింద్రాబాద్, తార్నాక, రాంనగర్, అల్వాల్, హబ్సిగూడ, నాచారం, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సంతోష్‌నగర్, చాదంఘాట్, చార్మినార్, అఫ్జల్‌గంజ్‌తో పాటు తదితర ప్రాంతాల్లో వాన దంచికొడుతుంది. ఈ నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరిస్తున్నారు.

# రాత్రింబవళ్లు ప్రజలకు రక్షణగా సీసీ కెమెరాలు : గజ్వేల్ ఏసీపీ నర్సింలు

మెదక్, ఆగస్టు 7:కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా రామారం గ్రామంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు దుర్గాప్రసాద్, హనుమంతు, గోపాల్, మహేష్ గౌడ్ వారి సహాయ సహకారాలతో గ్రామంలో (10) సీసీ కెమెరాలు ప్రధాన కూడళ్లలో ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలలో ఏర్పాటు చేశారు. ఈ రోజు గజ్వేల్ ఏసీపీ యం నరసింహులు, తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానస, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకరించిన దాతలతో కలిసి ప్రారంభించారు. ఏసీపీ నరసింహులు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను అభినందించారు.

ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని.. సీసీ కెమెరాలు ఉన్న గ్రామాల్లో ఎలాంటి కేసులు నమోదు కావడం లేదన్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని.. సీసీ కెమెరాలు మరింత భద్రత, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పిస్తాయని తెలిపారు. రాత్రింబవళు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. సీసీ కెమెరాలు ఉండి పని చెయ్యని గ్రామాలలో, సీసీ కెమెరాలు లేని గ్రామాల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్తులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు, రిపేర్ చేయడానికి డివిజన్ పోలీసులకు సహకరించాలని సూచించారు.

గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రతి ఒక్కరూ నిఘా ఉంచాలని ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా యువకులు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని తెలిపారు. జరుగుతున్న సైబర్ నేరాల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని.. ఎలాంటి లింకులు వచ్చినా ఓపెన్ చేయవద్దని సూచించారు. మానవ తప్పిదం వల్లనే సైబర్ నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి అమిటీ యూనివర్సిటీ రాక.. ఒప్పందం చేసుకున్న సీఎం రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 7:తెలంగాణ విద్యారంగం అభివృద్ధికి తమ వంతుగా సేవలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమిటీ యూనివర్సిటీ ఛాన్సలర్ అతుల్ చౌహాన్ తెలిపారు. ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అమిటీ యూనివర్సిటీ ఛాన్సలర్ అతుల్ చౌహాన్ కలిశారు.

తెలంగాణలో తమ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసినందుకు అతుల్ చౌహాన్ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో తాము ఒప్పందం చేసుకుంటామని... స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని చౌహాన్ సీఎంకు తెలియజేశారు. మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా బోధనతో ఇప్పటికే అమిటీకి మంచి పేరు ఉందన్నారు. తెలంగాణలో మరింతగా రాణించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

అయితే తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యాసంస్థలపై పర్యవేక్షణ కరువైందని ప్రతిపక్షలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యా వ్యవస్థను మెరుగుపరచడం కోసం సీఎం రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని తీసుకరావడం కీలక పరిణామంగా చెప్పుకోవచ్చు.

# త్వరలోనే ఇండియాకు పుతిన్



న్యూఢిల్లీ, ఆగస్టు 7: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్. త్వరలోనే ఇండియాలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు చెందిన తేదీలు దాదాపు ఖరారు అయినట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ తెలిపారు. ప్రస్తుతం ధోవల్.. మాస్కోలో ఉన్నారు. అయితే ఈనెల చివరలో ఆ భేటీ జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రష్యాతో వాణిజ్యం విషయంలో భారత్‌పై అమెరికా అదనపు సుంకం విధిస్తున్న నేపథ్యంలో మోదీ, పుతిన్ భేటీ కీలకం కానున్నది.

భారత్, రష్యా మధ్య రక్షణ, భద్రతా భాగస్వామ్యం అంశాలపై ధోవల్ చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్-400 సిస్టమ్స్ అంశంలో రష్యాతో ఆయన చర్చించనున్నారు. ప్రస్తుతం ఇండియా వద్ద మూడు ఎస్-400 డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. ఇటీవల పాక్‌తో జరిగిన ఉద్రిక్తతల వేళ వాటిని వాడారు. గత ఏడాది సెప్టెంబర్‌లోనూ ధోవల్ రష్యాలో పర్యటించారు. ఆ టూరు సమయంలో ఆయన పుతిన్‌తో భేటీ అయ్యారు.

మరో వైపు ట్రంప్, పుతిన్ కూడా భేటీకానున్నారు. ఆ ఇద్దరి భేటీకి వేదికను డిసైడ్ చేసినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. భేటీకి సంబంధించిన వేదిక అంశంలో రెండు దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. అమెరికా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్ ఇటీవల మాస్కోలో పర్యటించారు. ఆయన పర్యటన తర్వాత ఇద్దరు అగ్రనేతలకు చెందిన మీటింగ్‌పై అంగీకారం కుదిరినట్లు అంచనా వేస్తున్నారు. ఈ భేటీకి జెలెన్‌స్కీని కూడా ఆహ్వానించాలని అమెరికా నిర్ణయించింది. కానీ దీనిపై రష్యా స్పందించలేదు.

ఈనెల చివరలో ప్రధాని మోదీ.. చైనాలో పర్యటించనున్నారు. ఆ పర్యటనకు చెందిన నిర్ణయం తీసుకున్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అవుతారు. అమెరికా అదనపు సుంకాలు విధించిన నేపథ్యంలో ఇండియా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు

అమరావతి, ఆగష్టు 7: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం నగరంలోని ఫిషింగ్ హార్బర్ ఏరియాలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది.

ఫిషింగ్ హార్బర్ ఏరియాలోని హిమాలయ బార్ దగ్గర గురువారం సాయంత్రం ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కోదాడలో వివాహిత ఆత్మహత్య.. భర్తే చంపాడని ఆరోపణ



నల్గొండ, ఆగష్టు 7: కోదాడ పట్టణ పరిధి చెరువు బజార్‌లో గురువారం ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువు బజార్‌లో ఉండే ఉప్పుతల లక్ష్మి (40) అనే మహిళ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయింది. సమాచారం అందుకున్న మహిళ కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఆమె భర్త శ్రీనునే కొట్టి చంపాడని మృతురాలి బంధువులు ఆరోపించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ శివశంకర్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు.

మహిళ మృతిపై ఆమె తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదన్నారు. ఇది ముమ్మాటికీ హత్యేనని ఆరోపించారు. ఓ మహిళతో తన బిడ్డ భర్త శ్రీను వివాహేతర సంబంధం పెట్టుకుని గత కొన్నేండ్లుగా వేధిస్తున్నట్లు తెలిపారు. ఆమెనే పెండ్లి చేసుకుంటానని శారీరకంగా, మానసికంగా వేధిస్తూ నెల క్రితం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పెరిక సింగారం గ్రామంలోని తమ ఇంటికి పంపిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఇరువురి మధ్య సయోధ్య కుదిర్చి బిడ్డను భర్త వెంట పంపినట్లు తెలిపారు. ఇక ప్రశాంతంగా కాపురం చేసుకుంటారులే అనుకునేంతలోనే ఇలా తమ బిడ్డను విగత జీవిలా మార్చాడని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

# అష్టలక్ష్ముల ఆరాధనోత్సవాలు వరలక్ష్మి వ్రతం !

## (08 ఆగష్టు "వరలక్ష్మి వ్రత పర్వదినం" సందర్భంగా)

శ్రావణ శుక్ల పక్షంలో చివరి శుక్రవారం, అనగా 08 ఆగష్టు 2025 పుణ్య గడియల్లో "వరలక్ష్మి వ్రతం" ఆచరించడం హిందూ సమాజానికి సాంప్రదాయంగా వస్తున్నది. శ్రావణ పూర్ణిమ, రక్షాబంధన్ పర్వదినానికి ముందు వరలక్ష్మి వ్రతం వస్తుంది. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, యూపీ రాష్ట్రాల్లో విస్తృతంగా శ్రావణ శుక్రవారం (జూలై–ఆగష్టు) వరలక్ష్మి వ్రతం నిర్వహించుకోవడం సదాచారంగా వస్తున్నది. లక్ష్మి దేవికి నివాళిగా వివాహిత స్త్రీల ఈ పర్వదినం సందర్భంగా ఉపవాసం ఉంటూ, వారి భర్తతో పాటు కుటుంబ సభ్యుల శ్రేయస్సు, సంక్షేమాల కోసం వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తారు. 'వర' అంటే లక్ష్మి దేవి తన భక్తులకు ప్రసాదించే వరాలు అని అర్థం చేసుకోవాలి. విష్ణువు సహధర్మచారిణిగా, వరలక్ష్మి మహాలక్ష్మి దేవి యెక్క ప్రతిరూపంగా కొలుచుకుంటారు. "వరాలను ప్రసాదించే లక్ష్మీ దేవత"ను వరలక్ష్మిగా కొలుచుకుంటున్నాం.

వరలక్ష్మి వ్రత విధాన క్రమం:

వివాహిత మహిళలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాస దీక్షలు పాటిస్తూ, అత్యంత భక్తి శ్రద్ధలతో మహాలక్ష్మి పూజలు చేసుకుంటారు. ఇంటిని శుభ్రం చేసి, ముంగిట ముగ్గులు వేసి, కలశాలతో అలంకరించి, చందనం పూసి వరలక్ష్మి వ్రత పూజకు సిద్ధం అవుతారు. ముడి బియ్యం, నాణేలు, పసుపు, మామిడి ఆకులను కలశ కుండ నింపడానికి ఉపయోగించి, కొబ్బరి కాయను అమర్చి, ఆపై 'స్వస్తిక్' చిహ్నం గీస్తారు. మండప ఏర్పాటు, కలశ స్థాపన, అమ్మ వారి ప్రతిష్టాపన, పూజా సామాగ్రి సిద్ధం, ఐదు లేదా తొమ్మిది పోగులతో తోరాలను సిద్ధం చేసుకున్న తర్వాత పూజ విధానం ప్రారంభించాలి. వరలక్ష్మి వ్రత పూజా క్రమంలో పుణ్యాహవచనం, కలశ పూజ, వరలక్ష్మి అస్టోత్తర శతనామావళి, తోరాల పూజ, నైవేద్యం, కథా శ్రవణం, మంగళ హారతి, ప్రదక్షిణలు ప్రధాన అంశాలుగా ఉంటాయని తెలుసుకోవాలి. గణేశుడి పూజ, శ్లోకాల పఠనం, హారతి ఇవ్వడం, దేవతలకు తీపి పదార్థాలను సమర్పించడంతో పూజ కొనసాగుతుంది. మహిళలు తమ చేతులకు కంకణం కట్టుకొని బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. ఉడికించిన చిక్కుళ్లు, పొంగల్, బెల్లంతో చేసిన తీపిని పంపిణీ చేస్తారు. వరలక్ష్మి వ్రతం ఆచరించడం వల్ల శాంతి, శ్రేయస్సు, ఆర్థిక పరిపుష్టి లభిస్తాయనా నమ్ముతారు.

అష్టలక్ష్మిల దివ్య దీవెనలు:

వరలక్ష్మి దేవతను పూజించడం అంటే సంపద (శ్రీ లేదా ధనం), భూమి (భూమి), విద్య (సరస్వతి), ప్రేమ (ప్రీతి), కీర్తి (కీర్తి ప్రతిష్టలు), శాంతి (ప్రశాంతత), ఆనందం (తుష్టి), బలం (పుష్టి) అను ఎనిమిది దేవతలైన 'అష్టలక్ష్మి'లను భక్తితో పూజించడం జరుగుతుంది. వరలక్ష్మి వ్రత ఫలితంగా ధనం, ధాన్యం, ఆరోగ్యం, సంపద, దీర్ఘాయువు, ధైర్యం, ఋణ విముక్తి జరుగుతాయని మన మహిళల ప్రగాఢ నమ్మకం. వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించి లక్ష్మీ దేవి అనుగ్రహంతో అష్ట ఐశ్వర్యాలు, భోగభాగ్యాలు పొందాలని కోరుకుందాం, పూజను పవిత్ర భావనలతో నిర్వహించుతుందాం.

–డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

9949700037

# కళాశాలలు, విద్యాసంస్థలకు ఈమెయిల్ ద్వారా యుపీఎస్సీ ఉద్యోగ ప్రకటనల సమాచారం

న్యూఢిల్లీ, ఆగష్టు 7:పరీక్షలకు మరింత మంది ఉద్యోగార్థులు హాజరయ్యేందుకు వీలుగా యూపీఎస్సీ మరో ముందడుగు వేసింది. కళాశాలలు, విద్యాసంస్థలకు ఈ–మెయిల్ ద్వారా ఉద్యోగ నియామక ప్రకటనలను నేరుగా పంపాలని నిర్ణయించారు. ఫలితంగా విద్యాసంస్థలు, కళాశాలలు... యూపీఎస్సీ ప్రకటనలను ఇక మీదట నేరుగా ఈ–మెయిల్ రూపంలో పొందనున్నాయి. కేంద్ర ప్రభుత్వం లోని వివిధ మంత్రిత్వ శాఖలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన వివిధ గ్రూప్ ఏ, గ్రూప్ బీ గెజిటెడ్ పోస్టులను భర్తీ చేయడానికి యూపీఎస్సీ ఎప్పటికప్పుడు నియామకాలను చేపడుతోంది. అంతేకాకుండా సాధారణ పరీక్షలను కూడా తరచుగా నిర్వహిస్తోంది. విధుల స్వభావాన్ని బట్టి నియామకాల విషయంలో అభ్యర్థులు విద్యా, అనుభవానికి సంబంధించి అర్హతలను, కొన్ని సందర్భాల్లో అదనపు అర్హతలను కూడా యూపీఎస్సీ నిర్దేశిస్తోంది.

ఈ సందర్భంగా యూపీఎస్సీ ఛైర్మన్ డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ... "మేం సాధారణంగా నిర్వహించే పరీక్షలకు సంబంధించిన అభ్యర్థనలతో పాటు వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల నుంచి పలు రకాల ఉద్యోగాల విషయంలో కూడా నియామక అభ్యర్థనలు యూపీఎస్సీకి చేరతాయి. ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు, వేగవంతం చేయటానికి జనవరి నుంచి మార్చి వరకు గల 3 నెలల వ్యవధిలో ఈ అభ్యర్థనలు అందేలా చూసుకుంటున్నాం. ఒకేరకమైన వాటికి ఉమ్మడి పరీక్ష నిర్వహించటం ద్వారా సమాయానుకులంగా ప్రక్రియను పూర్తి చేసి నియమకాలు చేపట్టేందుకు కావాల్సిన ప్రణాళికను మెరుగైన రీతిలో తయారు చేసుకోవచ్చు" అని అన్నారు.

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల నుంచి కమిషన్ ఏటా 200కి పైగా నియామక ప్రతిపాదనలను అందుకుంటుంది. వాటికి సంబంధించిన అంతర్గత ప్రక్రియను కమిషన్ పూర్తి చేసిన అనంతరం ఆన్‌లైన్ ప్రకటనలను విడుదల చేస్తోంది. కేవలం 2025లో ఇప్పటికే 240కి పైగా నియామక అభ్యర్థనలను యూపీఎస్సీ అందుకుంది. ఇందులో వైద్య, శాస్త్రీయ– ఇంజనీరింగ్– సాంకేతిక, చట్టపరమైన, బోధన, ప్రత్యేక (మేనేజ్ మెంట్, ఫైనాన్స్, అకౌంట్స్, ఫోరెన్సిక్ ఆడిట్ మొదలైనవి) పోస్టులు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా గ్రూప్–ఏ, గ్రూప్–బీ గెజిటెడ్ స్థాయికి చెందినవే.

ప్రస్తుతం నియామక ప్రక్రియ సమాచారాన్ని ఎంప్లాయ్‌మెంట్ న్యూస్, యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్, యూపీఎస్సీ అధికారిక లింక్డ్ఇన్ ఖాతాల్లో ఇస్తున్నారు. ఈ–మెయిల్ ద్వారా సమాచారాన్ని అందించటం గురించి డాక్టర్ కుమార్ మాట్లాడుతూ.. "గతంలో వివిధ పోస్టులకు సంబంధించి మాకు అందే దరఖాస్తుల సంఖ్యలో కొన్ని లోటుపాట్లు గుర్తించాం. దరఖాస్తులను తనిఖీ చేస్తున్న సమయంలో అర్హతలు కలిగిన దరఖాస్తుదారులు లేకపోవటం వల్ల కొన్ని సార్లు నియామక ప్రక్రియ నిరర్థకం అవుతోంది. చాలా నియమకాల విషయంలో పోస్టుల కంటే తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. తగిన అభ్యర్థులు లేరని ఇంటర్వ్యూ బోర్డు తేల్చటం వల్ల కూడా పోస్టులు ఖాళీగా ఉండటం కానీ ఇంటర్వ్యూ దశలో నియామక ప్రక్రియ నిరర్థకమవటం కానీ అవుతుంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు.. అవసరమైన, అర్హత కలిగిన అభ్యర్థులకు చేరుకునేందుకు నియామక ప్రకటనలకు సంబంధించి కొత్త కార్యక్రమాలను రూపొందిస్తున్నాం. ఇందులో భాగంగా ఇతర విషయాలతో పాటు.. సంబంధిత సంస్థలకు ఈ–మెయిల్ ద్వారా ప్రకటనలు, తాజా సమాచారాన్ని పంపాలని నిర్ణయించాం. నమోదైన ఇతర, ప్రైవేట్ సంస్థలకు కూడా ఈ సమాచారం వెళ్లనుంది. యూపీఎస్సీకి సంబంధించినంత వరకు సమాచారం లేకపోవడం వల్ల అర్హత ఉన్న వారిని విడిచిపెట్టకూడదని వేం కోరుకుంటున్నాం" అని అన్నారు.

# పరిశోధక విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్

న్యూఢిల్లీ, ఆగష్టు 7:ఎన్ఐఎఫ్‌టీ చట్టం– 2006 కింద జౌళీ మంత్రిత్వ శాఖ నెలకొల్పిన చట్టబద్ధమైన సంస్థ జాతీయ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థ (ఎన్ఐఎఫ్‌టీ). జౌళి, వస్త్ర రంగాల్లో పరిశోధన, విద్యాపరంగా పురోగతిని క్రియాశీలకంగా ప్రోత్సహిస్తోంది. ఇది పీహెచ్‌డీ కోర్సులను నిర్వహించడంతోపాటు టీచింగ్ ఫెలోషిప్ ద్వారా పూర్తిస్థాయి పరిశోధకులకు ఆర్థిక సాయం అందిస్తుంది. ఇందులో భాగంగా నాలుగేళ్ల వరకు నెలవారీ స్టయిపెండ్, కంటింజెన్సీ గ్రాంట్, హెచ్ఆర్ఏ అందిస్తారు. అయితే, ఈ ఫెలోషిప్ అందని పరిశోధకులు బయటి వనరుల నుంచి అందే సహకారంతో ప్రాజెక్టు ఫెలోలు లేదా ఇండస్ట్రీ చైర్ ఫెలోషిప్‌లు పొందవచ్చు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ చివరి సెమిస్టర్ విద్యార్థులకు ప్రాయోజిత, పరిశ్రమ ఆధారిత పరిశోధన ప్రాజెక్టులను చేపట్టే అవకాశాన్ని కూడా ఎన్ఐఎఫ్‌టీ అందిస్తుంది. ప్రతి విద్యార్థికీ విద్యాపరంగా ఎన్ఐఎఫ్‌టీ నుంచి, పారిశ్రామికంగా ప్రాయోజిత సంస్థ నుంచి ఒక్కో మెంటార్ ఉంటారు. తద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయుల్లో అనువర్తిత పరిశోధన, పారిశ్రామిక భాగస్వామ్యాన్ని పెంపొందిస్తారు.

అంతేకాకుండా.. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన/నిధులను పొందే టెక్స్‌టైల్ సంస్థల్లో 3/4 సంవత్సరాల డిప్లొమా/అండర్ గ్రాడ్యుయేట్/పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చదువుకోవడానికి చేనేత కార్మికులు/కార్మికుల పిల్లలకు (ఇద్దరు పిల్లల వరకు) స్కాలర్‌షిప్ (ఒకరికి ఏడాదికి గరిష్టంగా రూ.2 లక్షల వరకు) లభిస్తుంది.

ఇంకా, నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్ మిషన్ (ఎన్‌టీటీఎం)లో భాగస్వామ్యం వహించేందుకు టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పాఠ్యాంశాల రూపకల్పన కోసం ప్రతిపాదనలు సమర్పించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అన్ని ఉన్నత విద్యా సంస్థలకు మార్గదర్శకాలను జారీ చేసింది.

ఈ రోజు లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో జౌళీ శాఖ సహాయ మంత్రి శ్రీ పబిత్ర మార్గరిటా ఈ సమాచారాన్ని అందించారు.

# 15 నుంచి ఏపీలో మహిళలకు ఫ్రీ బస్సు

అమరావతి, ఆగష్టు 7:కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏపీలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఈనెల 15 నుంచి పథకం ప్రారంభించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఈ స్కీమ్‌కు ప్రభుత్వం స్త్రీ శక్తి అనే పేరును సర్కార్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 15న ఈ పథకాన్ని ప్రారంభించనుంది.

రాష్టంలో ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లినా మహిళలు, ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ఈనెల 15న దీనిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ పథకాన్ని 5 కేటగిరి బస్సుల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో ఈ అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆధార్, ఓటర్, రేషన్‌కార్డుల్ని గుర్తింపు కార్డులుగా పరిగణించనున్నట్టు వివరించారు.

ఆ బస్సుల్లో మాత్రమే ఉచితం..

ఆగష్టు 15 నుంచి ప్రారంభమయ్యే మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి పథకానికి స్త్రీ శక్తి అని పేరు పెట్టారు. మొత్తం ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. మహిళలు ఆధార్, ఓటర్ కార్డ్, రేషన్ కార్డు ఐడిలో ఏదో ఒకటి చూపించాల్సి ఉంటుంది. ఈ ఉచిత ప్రయాణానికి సంబంధించి పల్లె వెలుగు , అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్, నగరాల్లో మెట్రో, సిటీ సబర్బన్ సర్వీసులు ఉంటాయి. వీటిలో మాత్రమే ఎక్కడినుంచి ఎక్కడికి అయినా ఉచితంగా ప్రయాణించవచ్చు. అదే సమయంలో ప్రీమియర్ సర్వీసులుగా ఉన్న నాన్ స్టాప్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులు, తిరుమల ఘాట్ () రోడ్డులో వెళ్లే బస్సులకు ఉచిత ప్రయాణ పథకం వర్తించదు. పొరపాటున ఈ బస్సుల్లో ఎక్కితే టిక్కెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే మహిళలు ఒకటికి రెండుసార్లు చూసుకుని బస్సులు ఎక్కాల్సి ఉంటుంది.

అయితే ఉచిత ప్రయాణ పథకంలో సైతం.. బస్సు ఎక్కిన మహిళలకు టికెట్లు ఇస్తారు. అయితే వాటిని జీరో ఫెర్ గా చూపిస్తారు. టికెట్ ధర జీరో గా చూపిస్తారు. వారు ప్రయాణించే స్టేషన్ల మధ్య టిక్కెట్ ధరను సైతం అందులో పొందుపరుస్తారు. అలా టికెట్ ధరను ప్రభుత్వ రాయితీ కింద చూపించనున్నారు. మరోవైపు ఉచిత ప్రయాణానికి సంబంధించి ఆర్టీసీ సిబ్బంది కి శిక్షణ కూడా ఇస్తున్నారు. అనవసర వివాదాలు లేకుండా.. మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించే విధంగా సిబ్బందికి పలు రకాల సూచనలు ఇస్తోంది ఏపీఎస్ఆర్టీసీ . మిగతా రాష్ట్రాల్లో ఈ పథకం అమలు జరుగుతుండగా అనేక రకాల వివాదాలు జరుగుతున్నాయి. అందుకే ముందు జాగ్రత్త చర్యగా శిక్షణ ఇస్తున్నట్లు తెలుస్తోంది.

# చేనేత రంగం అభివృద్ధే ధ్యేయం



అమరావతి, ఆగష్టు 7: వారసత్వ సంపదగా నిలిచిన చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆరోగ్య సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ , జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ లు సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం ధర్మవరంలోని కదిరి గేటు వద్ద ఉన్న నేతన్న విగ్రహం సమీపంలో 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత కేవలం జీవనోపాధి మాత్రమే కాకుండా మన సంస్కృతికి, మన ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. ఇటువంటి గొప్ప రంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా చేనేత రంగాన్ని కేంద్ర స్థాయిలో గుర్తించి, 2015, ఆగష్టు 7వ తేదీన చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జాతీయ చేనేత దినోత్సవం గా పాటించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో, ఈ రోజు 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించుకుంటున్నా మన్నారు. ప్రభుత్వం ప్రతి అర్హులైన చేనేత కుటుంబానికి నేరుగా రూ.25,000లు చెల్లిస్తుందని చెప్పారు. అలాగే జీఎస్టీ భారం నుంచి చేనేతలను విముక్తం చేయాలని నిర్ణయించి, 5% జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు.

రా మెటీరియల్ సప్లై స్కీమ్ కింద గత ఆర్థిక సంవత్సరంలో రూ.164 కోట్లు చెల్లించగా, అందులో రూ.25 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించినట్టు వెల్లడించారు.

అలాగే మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ను ధర్మవరంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించా మన్నారు. ఈ క్రమంలో మార్కెట్ యార్డులో 10ఎకరాల స్థలాన్ని గుర్తించి, త్వరలో భూమిపూజ నిర్వ హించనున్నట్లు తెలిపారు. ధర్మవరం పట్టణంలో నీటి సమస్యలు, అధిక లోడ్ సమస్యలపై చర్యలు తీసుకుం టూ, విద్యుత్ శాఖతో సంప్రదించి ప్రత్యేకంగా డీపీఆర్ సిద్ధం చేశారని.. రూ.110కోట్ల వ్యయంతో కొత్త విద్యుత్ ప్రాజెక్టుకు అనుమతి పొందే దిశగా కృషి జరుగుతోందన్నారు. ఇది పూర్తయితే ధర్మవరంలో మగ్గాలకు ఎటు వంటి విద్యుత్ లోపం ఉండదన్నారు.

జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ మాట్లాడుతూ చేనేత కేవలం జీవనోపాధి కాదు, భారత సంస్కృతిని ప్రతిభింభించే ప్రతీక లాంటి వృత్తి అని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగం అత్యధిక జనాభాకు ఉపాధి కల్పిస్తూ దేశంలోని మొత్తం వస్త్ర ఉత్పత్తిలో 19% భాగస్వామ్యం కలిగియున్నదన్నారు.

ప్రపంచం అన్ని రంగాల్లో వేగంగా మారుతున్న నేపథ్యంలో చేనేత రంగం కూడా సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అనేక కష్టాలు పడే వారని, నేడు ఆన్‌లైన్ మార్కెట్లు డిజిటల్ పోర్టల్స్ , ప్రభుత్వ వేదికలు వంటి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మార్పులను అంగీకరి ంచి, తరం నుండి తరం వరకు నైపు ణ్యాన్ని కొనసాగించడవే కాకుండా, ఆదాయాన్ని పెంపొందించే దిశగా చేనేత కుటుంబాలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా "చేనేత డిజైనింగ్" నందు జాతీయ అవార్డ్ అందుకున్న జిల్లా చేనేత డిజైనర్ జే.నాగరాజును మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ లు అభినందించారు. టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ , జనసేన స్టేట్ జనరల్ సెక్రటరీ చిలకం మధుసూదన్ రెడ్డి లు నేతన్నల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈసందర్భంగా ఉత్తమ చేనేత కార్మికులైన కాంతమ్మ, ఆంజనేయులు, ఈశ్వరయ్య, రామకృష్ణ తదితరులను ఘనంగా వారు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముందుగా ముఖ్య అతిధులు నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి నమస్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్, జనసేన స్టేట్ జనరల్ సెక్రటరీ చిలకం మధుసూదన్ రెడ్డి, చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ మురళి కృష్ణ, జాయింట్ డైరెక్టర్ కన్నబాబు, ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : ప్రవీణ్ కుమార్

నల్గొండ, ఆగషు 7:అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ ఆయిల్ సూర్యాపేట, ఖమ్మం జిల్లాల సేల్స్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కోదాడ మండల పరిధిలోని గుడిబండ శివారులో అంజన్ ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్ద గురువారం అగ్నిప్రమాద నియంత్రణకు డెమో ఏర్పాటు నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ టయప్ కంపెనీ బ్రాండ్స్ డాడీ రూపొందించిన ఆటో ఫెయిర్ ఎస్టింగ్ మిషన్ ప్రతి గృహంలో అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్, గ్యాస్, ఇతర అగ్ని ప్రమాదాలను ఈ యంత్రం నియంత్రిస్తుందని తెలిపారు. యంత్రం క్క ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. అనంతరం డెమో చూపించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ సేల్స్ ఆఫీసర్ సంపత్ కుమార్, కంపెనీ ప్రతినిధులు శైలేష్, దీపిక, అంజన్ గౌడ్, రాజశేఖర్, శ్యామ్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నేతన్నలకు పునర్ వైభవం..

## –కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
## –మగ్గాలతో అద్భుతాలు సృష్టించే సత్తా నేతన్నల సొంతం
## –చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కోరుట్ల, ఆగస్ట్ 7: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే నేతన్నలకు పునర్ వైభవం వచ్చిందని, నేత కార్మికులకు చేతినిండా పని కల్పించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్కు దక్కుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనం ఆవరణలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన ఎమ్మెల్యే రాట్నంపై నూలు వడికారు.

నేత కార్మికులతో కలిసి పతాకా విష్కరణ చేసిన ఆయన కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి నివాళు లర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మగ్గాలతో అద్భుతాలు సృష్టించే సత్తా మన నేతన్నల సొంత మని పేర్కొన్నారు. ఆగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీరలు తయారు చేసే నైపుణ్యం మన తెలంగాణ నేత కార్మికుల ప్రత్యేకత అని పేర్కొన్నారు. తరతరాలుగా చేనేత వృత్తిని నమ్ముకున్న నేత కార్మికులకు సమైక్య పాలనలో పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో నేతన్నలకు చేతి నిండా పనితో ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు.

ఉన్న ఊరిలో ఉపాధి కరువై పొట్ట చేతపట్టుకొని సూరత్, భీవండిలకు వలస వెళ్లిన చేనేత కార్మికుల కోసం వినూత్నమైన పథకాలు ప్రవేశపెట్టి తిరిగి తెలంగాణకు రప్పించి, ఉపాధి కల్పించామన్నారు. చేనేత మిత్ర, నేతన్నకు చేయూత, నేతన్న బీమా, బతుకమ్మ చీరలు, రుణమాఫీ, పెన్షన్లు వంటి ఎన్నో పథకాల అమలుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. కోరుట్ల దేనేత సహకార సంఘం భవనాన్ని వాటాదారులకు దక్కేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘ మాజీ అధ్యక్షులు గోనె శంకర్, పద్మశాలి సంఘ ఆధ్యక్షులు గుంటుక ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్, సహాయ కార్యదర్శి గోసికొండ కుమార స్వామి, కోశాధికారి అందె రాజ్ కుమార్, టీఆర్వీఎస్ కార్యదర్శి జిల్లా ధనుంజయ్, నాయకులు గద్దం మధు, చెన్న విశ్వనాథం. మచ్చ కవిత, ఎక్కల దేవి రాంచందర్, నల్ల ప్రశాంత్, పడాల గణేష్, ఎక్కలదేవి నవీన్, ముల్క ప్రసాద్, ఆడెపు నరేష్, చేనేత సహకార సంఘ వాటాదారులు తదితరులు పాల్గొన్నారు.

# పారాసెటమాల్, ఇతర సాధారణ మందులపై నిషేధం

న్యూఢిల్లీ, ఆగష్టు 7:పారాసెటమాల్ ఔషధంపై నిషేధం విధించినట్లుగా వస్తున్న వదంతుల గురించిన ఎలాంటి సమాచారం సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్‌కు (సీడీఎస్‌ఓ)కు అందలేదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. పారాసెటమాల్ మందుపై ఎలాంటి నిషేధాన్నీ విధించలేదని, అయితే ఇటివలి కాలంలో పారాసెటమాల్ కాంబినేషన్ మందులతో సహా నిర్ణీత మోతాదు కాంబినేషన్లను నిషేధం విధించినట్లు తెలిపింది. ఇలా నిషేధించిన కాంబినేషన్ల వివరాలు సీడీఎస్‌ఓ వెబ్‌సైట్ (www.cdsco. gov.in)లో చూడవచ్చని పేర్కొంది.

ఫార్మాస్యూటికల్స్ విభాగం అధీనంలో పనిచేస్తున్న నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ఔషధాల (ధరల నియం త్రణ) ఉత్తర్వు–2013 లో భాగంగా ఓటీసీ సహా ఇతర ఔషధాల ధరలను ఈ కింద తెలిపిన విధంగా ఖరారు చేసి, పర్యవేక్షిస్తోంది:

ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ విభాగం జారీ చేసిన అత్యవసర మందుల జాతీయ జాబితాలోనూ, ఔషధాల (ధరల నియంత్రణ) ఉత్తర్వు 'డీపీసీఓ'–2013 తొలి షెడ్యూ లులోనూ చేర్చిన ఓటీసీ ఫార్ములేషన్లు సహా ఔషధాలకు గరిష్ఠ ధరలను ఎన్‌పీపీఏ నిర్ధారిస్తుంది.

దీంతో పాటు ఆ ధరల ను అన్ని సరకుల టోకు ధరల సూచీని ఆధారంగా తీసుకుని, ఏటా సవరణలు చేస్తుంది. షెడ్యూలులో ప్రస్తావించిన మందుల ఉత్పత్తిదారు సంస్థలు, దిగుమతిదారు సంస్థలు, విక్రేతలు తమ ఉత్పత్తులను స్థానికంగా వర్తించే పన్నులను కూడా కలిపి నిర్ణయించిన గరిష్ఠ ధర లోపే విక్రయించాలి.

ఓటీసీ ఔషధాలు సహా కొత్త ఔషధాలకు (ఎన్ఎల్ఈఎంలో నమోదు చేసిన ఏదైనా మందు ప్రస్తుత తయారీదారు సంస్థల ద్వారా మరేదైనా మందుతో కలిపి గాని, లేదా ఇలాంటి మందుకుండే శక్తిని లేదా మోతాదును లేదా ఈ రెండిటిలోనూ మార్పు చేసిగాని ప్రవేశపెట్టిన ఫార్ములేషన్లు) చిల్లర ధరను ఎన్‌పీపీఏ నిర్ణయిస్తుంది.

దరఖాస్తు పెట్టుకున్న తయారీదారు సంస్థ, విక్రేతలకు.. ఈ చిల్లర ధర వర్తిస్తుంది. వీరు ఉభయులూ ఈ మందులను నిర్ణీత చిల్లర ధర లోపే అమ్మాలి. షెడ్యూలులో చేర్చని ఇతర ఫార్ములేషన్ల విషయంలో, (నాన్–షెడ్యూల్డ్ ఓటీసీ ఫార్ములేషన్లు సహా) తయారీదారు సంస్థలు వెనుకటి 12 నెలల్లో తాము ప్రవేశపెట్టిన ఈ తరహా ఫార్ములేషన్ల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)ను.. ఎంఆర్‌పీ కంటే 10 శాతానికి మించి పెంచరాదు.

ఈ నియమాన్ని పాటిస్తున్నదీ లేనిదీ ఎన్‌పీపీఏ పర్యవేక్షిస్తుం ది. అత్యవసర ఔషధాలు అందుబా టులో ఉండేటట్లు చూడడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సహా సార్వజనిక ఆరోగ్య సదుపాయాలకు తరలివచ్చే రోగులు తమ జేబులో డబ్బును ఖర్చు పెట్టు కోవాల్సి రావడాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్లో భాగంగా ఉచిత ఔషధ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ విషయాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనిలో భాగంగా, సార్వజనిక ఆరోగ్య సదుపాయాలలో అత్యవసర మందులను ఉచితంగా ఇవ్వడానికి గాను రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పైన ప్రస్తావించిన మిషన్... సమగ్ర వనరుల రూపంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ కార్యక్రమ అమలు ప్రణాళికలలో పేర్కొన్న అవసరాలను పరిగణనలోకి తీసుకుంటారు.




# విచ్చలవిడి ఎరువులు వాడొద్దు..



అమరావతి, ఆగష్టు 7: అన్న దాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని.. రైతుల క్షేమం, సంక్షేమంతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారమవుతుందని, ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో జరిగింది.

ఈ కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. రైతు జి.రవీంద్రనాథ్ ఠాగూర్ పొలంలో వరినాట్లు వేసి.. రైతులు అన్నివిధాలా ఎదిగేందుకు మేమంతా వారి వెనుక ఉన్నామనే భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ప్రత్యేక సమస్యలుంటాయని, ఈ నేపథ్యంలో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతో ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాగునీరు, విత్తనాలు, ఎరువులు, సీసీఆర్‌సీ కార్డులు, పంట రుణాలు.. ఇలా ప్రతి అంశానికి సంబంధించి రైతుకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని.. బయోమెట్రిక్ ఆధారిత ఆన్‌లైన్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే విచ్చలవిడిగా ఎరువులు వినియోగించవద్దని, తెలిసో తెలియకో అలా వినియోగిస్తే నేల నిస్సారమై, సాగుకు పనికిరాకుండా పోతుందన్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని సూచించారు. పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుందని..అదేవిధంగా ప్రకృతి సేద్య విధానాలను కూడా అనుసరించాలని సూచించారు. గుంటుపల్లిలో ప్రధానంగా బీపీటీ 5204, ఎంటీయూ 1318, ఎంటీయూ 1262, పీఎల్ 1100 రకాలు పండిస్తున్నారని.. వరికి సంబంధించి మొదటి దఫా యూరియా గుళికలు వేసి తర్వాత రెండు, మూడు విడతల్లో నానో యూరియా కు ప్రాధాన్యమివ్వాలని.. దీనివల్ల దాదాపు 50 శాతం ఎరువు ఆదా అవడమే కాకుండా సామర్థ్యమూ పెరుగుతోందన్నారు.

జిల్లాలో ఇప్పటికే 39 వ్యవసాయ డ్రోన్లు అందించామని, ఇక్కడ కూడా అవసరం మేరకు డ్రోన్లను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమం లక్ష్యంగా హైటెక్ అగ్రికల్చర్, ప్రెసిషన్ అగ్రికల్చర్, మార్కెట్ లింక్డ్ అగ్రికల్చర్ కు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. సాగు పరంగా ఎలాంటి ఇబ్బంది ఉన్నా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ (91549 70454) అందుబాటులో ఉందని.. కాల్ చేసి సమాచారమిస్తే వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎలాంటి వదంతులు నమ్మొద్దన్నారు. ఎరువులను అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా సంబంధీకులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు.

### ఉద్యాన పంటలతో సిరుల పంట:

కేవలం వరికి మాత్రమే పరిమితం కాకుండా ఉద్యాన పంటల సాగు దిశగా కూడా ముందుకు సాగాలని.. ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా పండ్ల, పూల తోటల సాగు చేపట్టి రెండు నుంచి మూడు రెట్ల అధికా ఆదాయం పొందొచ్చని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఈ ఏడాది జిల్లాలో 4 వేల ఎకరాల ఉద్యాన పంటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటికే 3,800 ఎకరాల్లో చేపట్టడం జరిగిందన్నారు. పొలం గట్లపైనా మునగ వంటి పంటలు పండించవచ్చన్నారు. తాజా సమావేశంలో రైతులు తమ దృష్టికి తెచ్చిన వీటీపీఎస్ కాలుష్యం , గ్రీన్ బెల్ట్ వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి సర్పంచ్ భూక్యా కవిత, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఏడీ శ్రీనివాసరావు, టెక్ ఏవో వాసుదేవ్ నాయక్, మండల వ్యవసాయ అధికారి యడవల్లి రజని, పీఏసీఎస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, స్థానిక ప్రగతిశీల రైతులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తాగించాలి : సీడీపీఓ నిర్మల

నల్గొండ, ఆగష్టు 7: తల్లి పాల ప్రాముఖ్యతను ప్రతి గర్భిణికి వివరించి బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించేలా చూడాలని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఆర్జాలబావి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారుల వయస్సు, బరువు, ఎత్తు కొలతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు పుట్టిన గంటలోపే ముర్రుపాలను పట్టించడం, 6 నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఉండడంతో పాటు వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుందన్నారు. 8 నెలలు నిండిన తర్వాత అదనపు ఆహారం అందిస్తూ రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు పట్టించాలన్నారు. చిన్నారులకు పోషక ఆహారాలను అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్ ఖుర్షీదా బేగం పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ ప్రకృతాంబ తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సుకన్య తల్లులు సరిత, మౌనిక, సులోచన, శ్వేత, లావణ్య, నీలవేణి, పద్మ, సంధ్యారాణి పాల్గొన్నారు.

# ఎంజీయూ వివిధ విభాగాల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల నియామకం



నల్గొండ, ఆగష్టు 7:నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వివిధ విభాగాలకు వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాల మేరకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లును నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంజీయూకు చెందిన సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మారం వెంకటరమణారెడ్డిని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి బీఓఎస్‌గా, సోషల్ వర్క్ విభాగానికి డాక్టర్ శ్రీధర్ (ఉస్మానియా విశ్వవిద్యాలయం), హిస్టరీ అండ్ టూరిజం విభాగానికి ప్రొఫెసర్ కె.విజయబాబు (కాకతీయ విశ్వవిద్యాలయం), పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు ప్రొఫెసర్ డాక్టర్ ఏవీఎన్ రెడ్డి (డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం) నియమితులయ్యారు. సిలబస్ తయారీ, పాఠ్యాంశాల రూపకల్పన, పరీక్షల నిర్వహణ విధానం, వివిధ విద్యాంశాల ప్రణాళిక రూపకల్పనలో వీరు ప్రధాన పాత్ర పోషించనున్నారు. రెండు సంవత్సరాల పాటు వీరు సేవలందించనున్నారు.

### నాక్ ఏ గ్రేడ్ లక్ష సాధనకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

మూడో విడత న్యాక్ గ్రేడింగ్ లో ఎంజీయూ ఏ గ్రేడ్ సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధ్యాపకులకు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. న్యాక్‌కు అందించే సెల్ఫ్ స్టడీ రిపోర్ట్స్ లోని అంశాలపై అధ్యాపకులు క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండి తద్వారా తమ విభాగాల ప్రత్యేకతల అనుసారం ముందుకు సాగాలన్నారు. పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులు తమ పరిశోధన కాలంలో కనీసం రెండు పరిశోధన పత్రాలను సమర్పించాలని, ఆ దిశగా అధ్యాపకులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుండి ఉత్తమ విద్యార్థులు, ఉత్తమ అధ్యాపకులను శాఖల వారీగా ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, సిఓఈ డాక్టర్ ఉపేందర్ రెడ్డి, వివిధ విభాగాల డీన్స్ ప్రొఫెసర్ ఆకుల రవి, ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి, ప్రొఫెసర్ రేఖ, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్ డా.కె. ప్రేమ్‌సాగర్, డా. కె. అరుణ ప్రియ, సిహెచ్ సుధారాణి, డా.శ్రీదేవి, స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ డా.హరీశ్ కుమార్, ఆడిట్ సెల్ డైరెక్టర్ డా. వై. ప్రశాంతి, ఐక్యూఏసీ డైరెక్టర్ డా.మిర్యాల రమేశ్ పాల్గొన్నారు.

### 20 అంశాల్లో అంతర్ కళాశాలల ఆటల పోటీల నిర్వహణ

2025-26 విద్యా సంవత్సరానికి గాను మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు 20 అంశాల్లో ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ హరీశ్‌కుమార్ తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాల్ లు విశ్వవిద్యాలయాల సూచన మేరకు తమ విద్యార్థుల జాబితాను సిద్ధపరచి, స్పోర్ట్స్ బోర్డ్ కు ఈ నెల 15లోగా అందజేయాలని కోరారు. విద్యార్థుల జాబితాను అధికారికంగా usbmguict 2025@gmail.com మెయిల్ ద్వారా పంపవచ్చని తెలిపారు.

# క్షేత్రస్థాయి (గ్రాస్ రూట్) సినిమా కార్యక్రమాలు మహిళలు, స్థానికులను శక్తిమంతం చేస్తాయన్న సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్

న్యూఢిల్లీ, ఆగష్టు 7:2025 అగస్టు 5న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల సమాచార, ప్రజా సంబంధాల శాఖ (ఐఎన్‌పీఆర్) కార్యదర్శులతో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి శ్రీ డాక్టర్ ఎల్. మురుగన్.. సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజా సమాచారంలో కేంద్ర-రాష్ట్ర సమన్వయాన్ని బలోపేతం చేయడం.. ప్రెస్ సేవా పోర్టల్, ఇండియా సినీ హబ్‌లను పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు కార్యాచరణను తయారు చేయటం.. చలనచిత్ర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు, దేశవ్యాప్తంగా సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి భాగస్వామ్య అవకాశాలను అన్వేషించటవే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.

సమావేశాన్ని ఉద్దేశించి కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ మాట్లాడారు. ఇండియన్ సినిమా హబ్ పోర్టల్‌ను ఏకీకృత సింగిల్-విండో వ్యవస్థగా పునరుద్ధరించినట్లు తెలిపారు. ఇది దేశవ్యాప్తంగా చిత్ర నిర్మాణ అనుమతులు, వాటికి సంబంధించిన సేవలు ఒక పద్ధతిలో లభించేలా చేస్తుందని అన్నారు. జీఐఎస్ సమాచారం, ఉమ్మడి ఫోంమ్‌లతో సులభతర చిత్ర నిర్మాణాన్ని ప్రోత్సహిస్తూ.. ప్రధానమంత్రి మోదీ సారథ్యంలోని భారతదేశ చలనచిత్ర అనుకూల విధానాలను ఇది ప్రదర్శిస్తోంది.

తక్కువ ఖర్చుతో కూడిన థియేటర్ల ద్వారా మహిళలు, స్థానిక ప్రజలకు సాధికారత కల్పించే క్షేత్రస్థాయి సినిమా కార్యక్రమాలను కూడా మంత్రి ప్రధానంగా తెలియజేశారు. ప్రపంచ స్థాయి ప్రతిభను ఆకర్షించడం, భారతదేశ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను పెంచడం, ప్రపంచ వ్యాప్తంగా సాంస్కృతిక దౌత్యాన్ని ప్రోత్సహించడం, రేపటి సృజనాత్మక మేధస్సులను శక్తిమంతం చేస్తోన్న వేవ్స్-2025, ఐఎఫ్‌ఎఫ్ఐ గోవా వంటి ప్రధాన ప్రపంచ స్థాయి కార్యక్రమాలను ప్రధానంగా ప్రస్తావించారు.

దేశంలో క్రియేటర్ ఆర్థిక వ్యవస్థను పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రధానంగా తెలియజేస్తూ.. ఇటీవల ప్రారంభమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీపై (ఐఐసీటీ) ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇది యానిమేషన్, గేమింగ్, సంగీతం, ఇతర సృజనాత్మక రంగాలలో యువతకు నైపుణ్యం కల్పించడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

మీడియా పురోగతికి సహకార పాలన

ఈ కార్యక్రమంలో సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు సమర్థవంతమైన కమ్యూనికేషన్, మీడియా అభివృద్ధిలో కేంద్ర-రాష్ట్ర సహకారం పోషించే కీలక పాత్రను ప్రధానంగా చెప్పారు. డిజిటల్ క్రియేటర్లు, స్థానిక మీడియా పెరుగుదల, జిల్లా స్థాయి ఐఎన్‌పీఆర్ వ్యవస్థలను శక్తిమంతం చేయవలసిన అవసరాన్ని వివరించారు. ప్రచురణ ప్రక్రియలు మరింత సాఫీగా సాగేందుకు అన్ని రాష్ట్రాలు ప్రెస్ సేవా పోర్టల్‌తో ఏకీకృతం కావాలని ఆయన కోరారు. అన్ని రాష్ట్రాల్లో మీడియా విభాగాల మధ్య సమన్వయం లోపించిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

సినిమా, కంటెంట్ సృష్టికి ఉన్న ఆర్థిక సామర్థ్యాన్ని కూడా ఆయన ప్రధానంగా చెప్పారు. మెట్రో నగరాలను దాటి వెళ్లాల్సి ఉందన్న ఆయన.. స్థానిక ప్రతిభకు మద్దతు ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేశారు. చిత్రనిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు, క్రియేటర్లు కంటెంట్ ద్వారా సంపాదించుకునేందుకు వీలుగా ఇండియా సినీ హబ్ వంటి కార్యక్రమాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. వేవ్స్‌ను ప్రపంచ స్థాయి ఉద్యమంగా అభివర్ణించారు. మీడియాకు సంబంధించిన వ్యవస్థలో అన్ని స్థాయిలలో సహకారాన్ని, చర్చలను మరింతగా పెంచేందుకు గోవాలో ఐఎఫ్‌ఎఫ్ఐ కార్యక్రమంలో రేడియో సదస్సును నిర్వహించేందుకు ఉన్న ప్రణాళికలను పంచుకున్నారు.

### దృష్టి సారించనున్న కీలక అంశాలు:

రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల సంబంధిత అధికారులను ప్రెస్ సేవా పోర్టల్‌కు అనుసంధానించటంతో పాటు .. పోర్టల్‌కు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేయటంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారించింది. ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ చట్టం (పీఆర్‌పీ) - 2023 కింద ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా దీనిని అభివృద్ధి చేసింది. పత్రికలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, చట్టబద్ధ పద్ధతులను అనుసరించే ప్రక్రియను ఇది సులభతరం చేయనుంది.

2024 జూన్ 28 నుంచి అందుబాటులోకి వచ్చిన నూతన హంగులతో కూడిన ఇండియా సినీ హబ్ పోర్టల్‌పై కూడా ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ పోర్టల్ ఇప్పుడు భారతదేశం అంతటా చలనచిత్రాల విషయంలో సింగిల్ విండో వ్యవస్థగా పనిచేస్తోంది. ఇది కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల స్థాయిలో చిత్రీకరణ అనుమతులు, ప్రోత్సాహకాలు, వనరులను చిత్ర నిర్మాతలు ఒకే దగ్గర పొందేందుకు ఉపయోగపడుతుంది. ఏడు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు ఇప్పటికే దీనితో పనిచేస్తున్నాయి. ఇరవై ఒక్క రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలు ఒక సాధారణ దరఖాస్తు ఫారమ్ ద్వారా ఈ వ్యవస్థలోకి వస్తున్నాయి.

జీఐఎస్ ఆధారంగా వివిధ ప్రాంతాల మ్యాపింగ్, పరిశ్రమ నిపుణుల నుంచి సేకరించిన కంటెంట్.. చిత్రీకరణకు సంబంధించిన, సంబంధించని వివిధ ప్రక్రియలు.. ప్రోత్సాహకాల విషయంలో ఇండియా సినీ హబ్ పోర్టల్ ఉపయోగపడుతుంది. చిత్రీకరణ విషయంలో ప్రపంచ గమ్యస్థానంగా భారత్‌కు ఉన్న ఆకర్షణను మెరుగుపరిచేందుకు దరఖాస్తుల ప్రక్రియ, ధ్రువీకరించిన సమాచారాన్ని పంచుకోవటం గురించి సమావేశంలో చర్చించారు.

సినిమా గురించి తెలియని ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో కూడిన సినిమా హాళ్లను ప్రోత్సహించటంపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక చిత్రాలను నిర్మించే దేశాల్లో భారత్ ఉన్నప్పటికీ చిత్రాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు అన్ని చోట్లా ఒకేలా లేవు. తృతీయ శ్రేణి, చతుర్ధ శ్రేణి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు.. ఆకాంక్షిత జిల్లాల్లో సేవలందించేందుకు మాడ్యులర్, మొబైల్ సినిమా నమూనాల అభివృద్ధిని మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది

జీఐఎస్ మ్యాపింగ్ ఉపయోగించి తక్కువ సినిమా హాళ్లున్న ప్రాంతాలను గుర్తించటం, ఉన్న ప్రజా మౌలిక సదుపాయాలను తిరిగి ఉపయోగించుకోవటం, సింగిల్-విండో వ్యవస్థల ద్వారా లైసెన్సింగ్‌ను క్రమబద్ధీకరించటం, అందరికి అందుబాటులో ఉండే విధంగా ఉన్న సినిమా మౌలిక సదుపాయాల విషయంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి పన్ను, భూ ప్రోత్సాహకాలను అందించటంపై సమావేశంలో చర్చించారు.

ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్‌ఎఫ్ఐ), వేవ్స్ బజార్ వంటి ప్రధాన చలనచిత్ర, కంటెంట్ ప్లాట్‌ఫామ్‌ల గురించి కూడా చర్చ జరిగింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ చిత్రీకరణ ప్రదేశాలను ప్రదర్శించడానికి, ప్రాంతీయ ప్రోత్సాహకాలను తెలియజేసేందుకు, స్థానిక ప్రతిభను ప్రోత్సహించడానికి వీటిని ఉపయోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. 55వ ఐఎఫ్ఎఫ్ఐలో 114 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. 30 దేశాల నుంచి 2,000 కంటే ఎక్కువ పరిశ్రమ ప్రతినిధులకు వేవ్స్ బజార్ వేదికైంది. ప్రత్యేక పెవిలియన్‌లను ఏర్పాటు చేయడం, భారతీయ పనోరమాలో పాల్గొనేందుకు ప్రోత్సహించటం, ప్రపంచ స్థాయి వ్యవస్థల్లో పనిచేసే అనుభవాన్ని సంపాదించుకునేందుకు సృజనాత్మక ప్రతిభను నామినేట్ చేయడం ద్వారా రాష్ట్రాలు ఈ అవకాశాలను ఉపయోగించుకోవచ్చు.

భారతదేశ ప్రత్యక్ష వినోద ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిపై కూడా సమావేశం దృష్టి సారించింది. వివిధ కార్యక్రమాల కోసం ఇప్పటికే ఉన్న క్రీడలు, సాంస్కృతిక మౌలిక సదుపాయాలను ఉపయోగించడం.. ఇండియా సినీ హబ్‌లో అనుమతి ప్రక్రియను ఏకీకృతం చేయడం.. నోడల్ అధికారులను నియమించడం.. ప్రత్యక్ష వినోదానికి సంబంధించిన మౌలిక సదుపాయాలలో పెట్టుబడుల కోసం విధాన, ఆర్థిక సహాయాన్ని అందించటం గురించి రాష్ట్ర ప్రతినిధులతో చర్చించారు.

డిజిటల్ సాధికారత సాధించిన, సాంస్కృతికంగా శక్తిమంతమైన సమాజంగా భారతదేశ పురోగతికి దోహదపడుతూ కమ్యూనికేషన్, సృజనాత్మక ఆర్థిక అభివృద్ధిలో సహకారాన్ని బలోపేతం చేయటమే లక్ష్యంగా ఈ ఉన్నత స్థాయి చర్చా సమావేశం జరిగింది.

# మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి : పీడీ శేఖర్ రెడ్డి



నల్గొండ, ఆగష్టు 7:హరితహారంలో భాగంగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని నల్లగొండ పీడీ శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం చందంపేట మండల కేంద్రంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నర్సరీలో ఉన్న మొక్కలను ఏపుగా పెంచి, హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని ఇందుకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రతి గ్రామంలో నర్సరీ వనరులను ఎంపీడీఓలు పరిశీలించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి, ఏపీఓ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై జూలూరుపాడులో విస్తృత ప్రచారం



ఖమ్మం, ఆగష్టు 5:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేస్తూ గురువారం బీజేపీ మండల కమిటీ విస్తృత ప్రచారం నిర్వహించింది. మెయిన్ రోడ్‌లో షాపు షాపుకు తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డ అరుణ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు. ఎరువులపై సబ్సిడీ, ప్రతి మనిషికి నెలకి 5 కిలోల రేషన్ బియ్యం, బీమా పథకాలు, ఉచిత గ్యాస్ పథకం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక చేయూత వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏ పథకం తెచ్చినా పార్టీలకు సంబంధం లేకుండా ఇస్తున్నది. అదే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు చెందాల్సిన సంక్షేమ పథకాలు కాంగ్రెస్ కార్యకర్తలు అయితే మాత్రమే అందజేస్తుందని దుయ్యబట్టారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని గొప్పలు చెప్పుకుంటున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీశ్, బీజేపీ మండలాధ్యక్షుడు భూక్య రమేశ్, సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, నిమ్మటూరి రామారావు, బాలకిషన్, గుగులోత్ రాంబాబు, భూక్య రవి, సిరిపురపు గోపాలరావు, నరవనేని కృష్ణ పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి - ప్రవీణ్ కుమార్

నల్గొండ, ఆగష్టు 7: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ ఆయిల్ సూర్యాపేట, ఖమ్మం జిల్లాల సేల్స్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కోదాడ మండల పరిధిలోని గుడిబండ శివారులో అంజన్ ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్ద గురువారం అగ్నిప్రమాద నియంత్రణకు డెమో ఏర్పాటు నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ టయప్ కంపెనీ బ్రాండ్స్ డాడీ రూపొందించిన ఆటో ఫెయిర్ ఎస్టింగ్ మిషన్ ప్రతి గృహంలో అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్, గ్యాస్, ఇతర అగ్ని ప్రమాదాలను ఈ యంత్రం నియంత్రిస్తుందని తెలిపారు. యంత్రం క్క ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. అనంతరం డెమో చూపించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ సేల్స్ ఆఫీసర్ సంపత్ కుమార్, కంపెనీ ప్రతినిధులు శైలేష్, దీపిక, అంజన్ గౌడ్, రాజశేఖర్, శ్యామ్ పాల్గొన్నారు.

# ఆగస్టు 20 వరకు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయండి

## -తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ కేసులో GHMC కి హైకోర్ట్ గడువు

హైదేరాబాద్ ఆగస్టు 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ దాఖలు చేసిన కేసును హైకోర్టు న్యాయమూర్తి బి. విజయసేన్ రెడ్డి సమక్షంలో లిస్ట్ చేశారు. ప్రకాష్ ఆర్ట్స్ న్యాయవాది అనిల్ కుమార్ మరియు GHMC ప్రభుత్వ న్యాయవాది మధుసూధన్ రెడ్డి కోర్టుకు హాజరై, తమ కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయడానికి రెండు వారాల పొడిగింపును కోరారు. అయితే, మిగిలిన ప్రతివాదులు హాజరు కాలేదు.అందుకు న్యాయమూర్తి కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయడానికి 20 ఆగస్టు 2025 వరకు సమయం ఇచ్చారు. నేల స్థాయి నుండి 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో హోర్డింగ్‌లను ఏర్పాటు చేసే హక్కుకు సంబంధించి 209 దీర్ఘకాలంగా నమోదైన ఏజెన్సీలు మరియు 53 పిటిషనర్ ఏజెన్సీలకు న్యాయం కోరుతూ. తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ జూలై 9 న హైకోర్టును ఆశ్రయించారు.ప్రస్తుతం, ఉఊఓఅ 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో హోర్డింగ్‌లను నిర్వహించడానికి ఎంపిక చేసిన 3 ఏజెన్సీలను మాత్రమే ఎటువంటి పరిమితులు లేకుండా అనుమతిస్తోంది, ఇది 2020లో జారీ చేయబడిన G.O. Ms. No 68 యొక్క స్పష్టమైన ఉల్లంఘన. ఒక సంఘంగా, 209 పాత రిజిస్టర్డ్ ఏజెన్సీలు మరియు 53 పిటిషనర్ ఏజెన్సీలతో సహా అన్ని అర్హత కలిగిన ఏజెన్సీలకు 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో హోర్డింగ్‌లను అనుమతించడానికి తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ న్యాయం చేయమని హైకోర్టు ను ఆశ్రయించారు. అందుకు ప్రకాష్ ఆర్ట్స్, శ్రీ ఖీఓఐ కన్స్ట్రక్షన్స్ (లీడ్ స్పేస్), మరియు నవనిర్మాణ్ అసోసియేట్స్. నోటీసులు జారీ చేసింది.

కావాలని GHMC ఇంకా తన ప్రతిస్పందనను సిద్ధం చేయలేదని మరియు ఉద్దేశపూర్వకంగా ఈ విషయాన్ని ఆలస్యం చేస్తున్నట్లుగా కనిపిస్తోందని తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ పేర్కొంది.

# 42% బిసి రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం

## -ఢిల్లీలో గర్జించిన ఆలేరు కాంగ్రెస్ కొదమసింహం బీర్ల అయిలయ్య

న్యూ ఢిల్లీ ఆగస్టు 7(ఎక్స్ ప్రెస్ న్యూస్):బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన మహా ధర్నా ఆరంభం మాత్రమేనని, బీసీలకు న్యాయపరమైన రిజర్వేషన్లు సాధించేవరకు కాంగ్రెస్ పోరాటం ఆగబోదని ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రకటించారు. ఢిల్లీలో బుధవారం కాంగ్రెస్ నిర్వహించిన మహాధర్నాలో రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ,ఎంపీలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు లక్షలాదిగా తరలివెళ్లి హాజరయ్యారు. రాష్ట్రంలో ఆమోదం తెలిపి ఢిల్లీలో మోకాలు అడ్డుతున్న బిజెపికి బీసీల నుంచి విముఖత తప్పదన్నారు. బీసీలు, మైనారిటీలు కాంగ్రెస్ పక్షాన ఉన్నారన్న సాకుతోనే ద్వంద్వ ప్రమాణాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. జై కాంగ్రెస్ అంటూ ఆయన ప్రారంభించిన ప్రసంగం మహాధర్నాలో హైలెట్ గా మారింది .కాంగ్రెస్ అతిరథ మహారథులు ఆయన ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించారు .




# మధిరలో కోర్టు భవన నిర్మాణానికి భూమి పూజ



ఖమ్మం, ఆగష్టు 5: మధిర సివిల్ కోర్టు భవన నిర్మాణానికి ఖమ్మం జిల్లా జడ్జి జి.రాజగోపాల్ గురువారం భూమి పూజ చేశారు.

కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 24 కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా జిల్లా జడ్జి సూచించారు.

ఈ కార్యక్రమంలో మదిర సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, జూనియర్ సివిల్ జడ్జి దీప్తి, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిజిక్స్ చూసి పెళ్లిళ్లు.. కెమిస్ట్రీ బాగోలేదని విడాకులు

## - నేటి వివాహ వ్యవస్థపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భారతీయ వివాహ వ్యవస్థలో వస్తున్న మార్పులపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మన కుటుంబ, వివాహ వ్యవస్థ చూసే ప్రపంచ దేశాలు గౌరవిస్తాయని తెలిపారు. కానీ నేడు వివాహ వ్యవస్థపై నమ్మకం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఫిజిక్స్ చూసి పెళ్లిళు చేసుకుంటున్నారు.. కెమిస్ట్రీ బాగోలేదని విడాకులు తీసుకుంటున్నారని తెలిపారు. 56 ఏళ్లుగా బీజేపీకి సేవలందిస్తున్న సీనియర్ కార్యకర్త వల్లూరు శ్రీమన్నారాయణ అభినందన సభను విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. ఏ పని అయినా ఇష్టపడి చేస్తే.. కష్టం అనేది ఉండదని తెలిపారు.రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలని వెంకయ్య నాయుడు సూచించారు. నేటి రాజకీయ పరిస్థితుల్లో ఎవరూ ఏ పార్టీకి చెందిన వారో స్పష్టంగా తెలియని స్థితి ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ మారే నాయకుల పరిస్థితి బస్సుల రాకపోక లాగా మారిపోయిందని విమర్శించారు. గతంలో నాయకులు ఒక పార్టీ విడిచి మరో పార్టీలో చేరడానికి సిద్ధాంతాలు కారణాలు ఉండేవని.. ఇప్పుడు డైపర్లు మార్చినంత సులువుగా పార్టీలు మారుతున్నారని ఎద్దేవా చేశారు. ఇది రాజకీయాలకు తగదని వ్యాఖ్యానించారు.ఒక పార్టీని నమ్మి, ఆ పార్టీ కోసం పనిచేసేవారే నిజమైన నాయకుడు అని వెంకయ్య నాయుడు అన్నారు. ఈ విషయంలో శ్రీమన్నారాయణ చాలామందికి ఆదర్శమని అన్నారు. జట్కా బండ్లపై తిరిగి వాజ్‌పేయి, అద్వానీతో ప్రచారం చేసిన రోజుల్లో నుంచే శ్రీమన్నారాయణ బీజేపీ పదవుల ఆశ లేకుండా, కేవలం నిబద్ధతతో పనిచేశారని గుర్తుచేశారు. శ్రీమన్నారాయణ నిబద్ధత ప్రతి కార్యకర్తకు ఆదర్శమని తెలిపారు. రాజకీయ నాయకుల నడవడిక, పనితీరును ప్రజలు గమనించాలని సూచించారు. ఎదుట వారితో గౌరవ మర్యాదలు పాటిస్తే.. అదే గౌరవం మనకి దక్కుతుందని తెలిపారు. కుటుంబమంతా కలిసి అన్యోన్యంగా ఉంటే ఆ బలమే వేరని పేర్కొన్నారు. శ్రీమన్నారాయణ అందరినీ గౌరవిస్తూ.. సహకరిస్తూ తన ప్రత్యేకతతో అందరికీ ఆప్తులుగా మారారని చెప్పారు.

# రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

## -జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య.




సంగారెడ్డి ఆగస్టు 07 (నేటి నిజం ప్రతినిది) సంగారెడ్డి జిల్లా పరిధిలో నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం అధికారులను ఆదేశించారు.

సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వరకు. మొత్తం ఐదు ప్యాకేజీలుగా ఈ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం సంగారెడ్డి జిల్లా పరిధిలో భూమిని సేకరించాలని నిర్ణయించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా అధికారుల నుండి రీజినల్ రింగ్ రోడ్డు భూ సకరణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ మాధురి, ఆందోల్ ఆర్డీవో పాండు, గజ్వేల్ మేనేజర్ నేషనల్ హైవే అథారిటీ మేనేజర్ శ్రీహరి, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ పెద్దవంగర ఆధ్వర్యంలో ఘనంగా చేనేత దినోత్సవ వేడుకలు




మహబూబాబాద్, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వడ్డె కొత్తపల్లి గ్రామంలో ఘనంగా చేనేత దినోత్సవ ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చేనేత పై ఆధారపడిన వారిని చేనేత యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ పద్మశాలిలకు చేనేత కార్మికులకు సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మల్లికార్జున చారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భారతదేశంలో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది. చేనేత కార్మికుల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి మరియు చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నారు. తొలిసారిగా 2015 ఆగస్టు 7న ప్రధాని నరేంద్ర మోడీ చెన్నైలో ప్రారంభించారు. చేనేత కార్మికులు ఒక చీర నేయడానికి కుటుంబం మొత్తం నెలల తరబడి పని చేయడం జరుగుతుంది.కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం,వీరి యొక్క శ్రమను గుర్తించి వీరికి ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ ఎదునూరి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి రాపోలు శ్రీనివాస్,కోశాధికారి మధుసూదన్ రెడ్డి,ముత్తినేని శ్రీనివాస్, మొగ్రిగాడుదుల శ్రీనివాస్,గట్ల లక్ష్మినారాయణ,గుల్లపల్లి సదానందం, సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

# సంధ్య థియేటర్ ఘటనపై సిపిస్‌కు షోకాజ్ నోటీసులు

హైదరాబాద్ ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అల్లు అర్జున్ రీసెంట్ బ్లాక్‌బస్టర్ హిట్ సినిమా 'పుష్ప-2' ఎంత సక్సెస్ సాధించిందో అందరికీ తెలిసిందే. అయితే ఆ చిత్రం విడుదల సందర్భంగా హైదరాబద్‌లో విషాదం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోన సంధ్య థియేటర్లో ఈ సినిమా విడుదల సందర్భంగా హీరో అల్లు అర్జున్ అతిథిగా వచ్చారు. దీంతో తమ అభిమాన హీరోను చూస్తేందుకు వేల సంఖ్యలో ఫ్యాన్స్ అక్కడకు వచ్చారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి.. ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. (ఔఊఖీఅ)తాజాగా ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ సిఎస్‌కు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సి) (ఔఊఖీఅ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సంధ్య థియేటర్ ఘటన దర్యాప్తుపై ఎన్‌హెచ్ఆర్‌సి అసహనం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పోలీసులు సమర్పించిన నివేదికపై అసంతృప్తి తెలిపింది. బాధిత కుటుంబానికి పరిహారం రూ.5 లక్షలు ఇచ్చేలా ఆదేశాలు ఎందుకు ఇవ్వకూడదో చెప్పాలని కమిషన్ అడిగింది. షోకు పోలీసులు అనుమతి లేదని రిపోర్టులో తెలిపారని.. అనుమతి లేకుంటే నటుడు, అభిమానులు ఎందుకు వచ్చారో తెలియట్లేదు అని పేర్కొంది. ముందే చర్యలు తీసుకుంటే తొక్కిసలాట జరిగేది కాదని తెలిపింది. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఆరు వారాల్లో మరో నివేదిక ఇవ్వాలని.. దర్యాప్తు నిష్పక్షపాతంగా చేయాలని హైదరాబాద్ సిపికి ఆదేశాలు జారీ చేసింది.

# కార్మిక సమస్యలు పరిష్కరించాలని సింగరేణి సిఎండికి వినతి



ఖమ్మం, ఆగష్టు 5: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాంను హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కొరివి రాజకుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు పలు కార్మిక సమస్యలపై చర్చలు జరిపారు. అందులో భాగంగా ప్రథమంగా సిఎండి, డైరెక్టర్ల స్ట్రక్చర్ సమావేశంలో ఒప్పుకున్న పలు కార్మికుల సమస్యలపై 15 రోజుల్లో సర్కులర్లు యాజమాన్యం విడుదల చేస్తుందని తెలిపారు. కాగా మైనింగ్, ట్రేడ్స్ మెన్ ఉద్యోగులు మెడికల్ అన్‌ఫిట్ అయితే వారికి సర్ఫేస్ లో సుటబుల్ జాబ్ ఇవ్వడానికి, ఈపి ఆపరేటర్లకు. ఆ టు అ, అ టు ః గ్రేడ్ వారికి వెకెన్సీస్ తో సంబంధం లేకుండా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు.

అదే విధంగా మారుపేర్ల విషయంపై అడ్వకేట్ జనరల్ దగ్గర ఉన్నందున యాజమాన్యం మారు పేర్ల సమస్యని వెంటనే పరిష్కారం అయ్యేలా ప్రభుత్వంతో పాటు అడ్వకేట్ జనరల్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించి కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అదేవిధంగా ఇటీవల జరిగిన మెడికల్ బోర్డులో 55 మంది బోర్డుకి హాజరు అవ్వగా ఐదుగురుని మాత్రమే అన్‌ఫిట్ చేశారని, వారికి మళ్లీ మెడికల్ బోర్డు పెట్టాలని కోరుతూ మెమొరాండం అందించారు. ఈ విషయంపై సిఎండి సానుకూలంగా స్పందించినట్లు వారు వెల్లడించారు.

# ముస్లింల రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ పార్టీ ధర్నా చేస్తోంది: కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్ ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ముస్లింల రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ పార్టీ ధర్నా చేస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. బిసి ముసుగులో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లు ఇచ్చే కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ చేసే ధర్నాకు బిసిల మద్దతు కరువైందని ఎద్దేవా చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే మద్దతు ఇస్తామని బండి ప్రకటించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎప్పుడైనా బిసిని ప్రధానిని చేశారా? అని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బిసినైనా సిఎం చేశారా? అని అడిగారు. మంత్రపదవులు, నామినేటెడ్ పదవులను బిసిలకు ఎన్ని ఇచ్చారని నిలదీశారు. కేంద్రంపై నెపం మోపి తప్పించుకోవాలని కాంగ్రెస్ చూస్తోందని బండి చురకలంటించారు.

# ఐఏఎస్ లు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు

## -రెండున్నర ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుంది

## -బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్ ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మహేశ్వరం నియోజకవర్గంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి అవమానం జరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి పరిస్థితి విచిత్రంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఐఎఎస్ లు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదని ఐఎఎస్ లు చెబుతున్నారని అన్నారు. ఐఎఎస్ లు రాజకీయాలు మాట్లాడడం సరికాదని విమర్శించారు. రెండున్నర ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, గతంలోమాజీ సిఎం కెసిఆర్ 24 గంటలు విద్యుత్ ఇచ్చారని తెలియజేశారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం లోకి వచ్చాక అందరి లెక్కలు సరిచేస్తామని కెటిఆర్ సూచించారు.కెసిఆర్ పాలనలో అందరికి న్యాయం జరిగిందని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో జరిగిన మంచి పనులు కార్యకర్తలు చెప్పలేక పోయారని అందుకే ఓడిపోయామని ఆవేదనను వ్యక్తం చేశారు. కెసిఆర్ ను మళ్లీ సిఎం చేయడానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో భూముల విలువలు తగ్గిపోయాయని, యూరియా కోసం చెప్పులు లైన్లలో పెట్టాల్సి వస్తోందని కెటిఆర్ ఎద్దేవ చేశారు. రుణమాఫీ విషయంలో రాష్ట్రప్రభుత్వం విఫలం చెందిందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. ఓట్లు ఉన్నప్పుడు కాదని.. నాట్లు వేసేటప్పుడు రైతుబంధు వేయాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక ప్రభుత్వం రైతుబంధు ఎత్తేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో రాష్ట్రంలో చాలా మంది మోసపోయారని కెటిఆర్ మండిపడ్డారు.

# అతివేగం ప్రమాద హేతువు

## – ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కేసులు..జరిమానా లు

## – వంగపల్లి బి ఆలేరు శివారు లో బ్లాక్ స్పాట్స్ గుర్తింపు

యాదగిరిగుట్ట,ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని... నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని స్థానిక యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎలగొండ కృష్ణ హెచ్చరించారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా జాతీయ రహదారి ఔఊ-163 పై వంగపల్లి నుండి ఆలేరు శివారులోని కాకతీయ కళాతోరణం వరకు రహదారిపై బ్లాక్ స్పాట్స్ గుర్తించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎలగొండ కృష్ణ తోపాటు రాచకొండ కమిషనరేట్ లో పనిచేస్తున్న ఈ బి చలానా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ వారి సిబ్బంది తో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ఏర్పాటు చేయాల్సిన బుల్లర్స్ గుర్తించి నమోదు చేశారు . గుర్తించిన ప్రమాదకర ప్రదేశాల్లో ప్రమాద నివారణ ఏర్పాట్లు చేస్తామన్నారు. గత సంవత్సరం తో పోలిస్తే ఈ సంవత్సరం రోడ్డు ప్రమాదాలు, మరణాలు చాలా వరకు తగ్గినాయని తెలిపినారు. ఔఊ-163 రహదారిపై గంటకు 80 కిలోమీటర్ల వేగంతో మాత్రమే వెళ్లవలసి ఉండగా... వాహనదారులు అధిక వేగంతో వెళ్ళినట్లయితే ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు .త్వరలో వాహనవేగాల స్పీడ్ లిమిట్ పై నిఘా ఏర్పాటు చేస్తామని,అతిక్రమించినట్లయితే జరిమానా విధిస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో రాచకొండ ట్రాఫిక్ సేఫ్టీ వింగ్ సిబ్బంది రాకేష్ , శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా ఇండియా పోస్ట్ అడ్వాన్స్డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ)

న్యూఢిల్లీ, ఆగష్టు 7:ఐటీ 2.0 కింద డిజిటల్ పరివర్తనలో భాగంగా.. ఇండియా పోస్ట్ దేశవ్యాప్తంగా అడ్వాన్స్డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ) అప్లికేషన్‌ను విస్తృతంగా అమలు చేస్తోంది. సంప్రదాయ విధానాల నుంచి వేగవంతమైన, అంతరాయం లేని, వినియోగదారులకు మరింత కేంద్రీకృత పోస్టల్ సేవల దిశగా ఇదొక ప్రధాన ముందడుగు.

పట్టణ, గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో 1.64 లక్షలకు పైగా పోస్టాఫీసుల్లో ఈ కీలక మార్పులను ప్రవేశపెట్టారు. విస్తృత స్థాయి మార్పులు, సంక్లిష్టతల కారణంగా మొదటి రోజు, అంటే ఆగస్టు 4న కొంత ఒత్తిడి ఏర్పడింది. అయితే సాంకేతిక బృందం రోజంతా శ్రమించి ఆగస్టు 5 నాటికి ఆ సమస్యను పరిష్కరించింది.

ఈ సాంకేతికతలను పెద్దఎత్తున అమలు చేయడం, అందులోని సంక్లిష్టతల కారణంగా ఈ సవాళ్లను పోస్టల్ విభాగం ముందుగానే అంచనా వేసింది. నిర్వహణ సమస్యలను వెంటనే పరిష్కరించడానికి ప్రత్యేక సహాయక బృందాలు, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. లావాదేవీల వేగం, డిజిటల్ చెల్లింపుల సమన్వయం, రియల్ టైమ్ ట్రాకింగ్‌తోపాటు మొత్తం వినియోగదారుల అనుభవాన్ని ఏపీటీ వ్యవస్థ గణనీయంగా మెరుగుపరుస్తోంది. ఆగస్టు 5న ఈ అప్లికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా 20 లక్షలకు పైగా వస్తువులు బుక్కవగా.. 25 లక్షలకు పైగా వస్తువులు పంపిణీ అయ్యాయి.

# నైపుణ్యం, సృజనాత్మకత కలయిక చేనేతలు

## -చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పెన్షన్

## -అమరాతిలో హ్యాండ్ లూమ్ మ్యూజియం ఏర్పాటు

## -సిఎం చంద్రబాబు నాయుడు



అమరావతి ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: నైపుణ్యం, సృజనాత్మకత కలయిక చేనేతలు అని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. భారతీయ శక్తి, సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక చేనేతలు అని అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు చేసిన 11వ జాతీయ చేనేత దినోత్సవంలో సిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరాతిలో హ్యాండ్ లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని అన్నారు. తర్వాత అధికంగా ఉపాధి కల్పించే పరిశ్రమ వస్త్ర పరిశ్రమ చేనేత అని టిడిపికి నేతన్నలకు అవినాబావ సంబంధం ఉందని చెప్పారు. 55,500 మంది చేనేత కార్మికులకు రూ.2 లక్షల చొప్పున రూ.27 కోట్లు రుణాలు, 90,765 కుటుంబాలకు వంద యూనిట్లు కరెంట్ ఉచితంగా ఇచ్చామని తెలియజేశారు. చేనేత కార్మికులకు తొలిసారిగా 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించామని, చిన్న వయసులోనే అనారోగ్యం పాలవుతున్న పరిస్థితి.. అందుకే 50 ఏళ్లకే పెన్షన్ తీసుకొచ్చామని అన్నారు. 50 శాతం పెట్టుబడితో మరమగ్గాలకు రూ. 80 కోట్లు ఖర్చు పెట్టామని, ఆప్కో ద్వారా కొనుగోళ్లపై కూడా ఆపేశారని సబ్సిడీలు ఎత్తేశారని విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మొదట గుర్తొచ్చేది చేనేత కార్మికులేనని, ఈ నెల నుంచే 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగాఇస్తామని హామీ ఇచ్చారు. ఉచిత విద్యుత్ వల్ల 93 వేల కుటుంబాలకు లబ్ధి కలగనుందని, చేనేతలకు ఎంత ఇచ్చినా తక్కువేనని అన్నారు. 5,386 మందికి రూ. 5 కోట్లు నిధులు విడుదల చేస్తున్నామని, నేతన్న భరోసా కింద అదనంగా రూ. 25 వేలు ఇప్పించే బాధ్యత తమది భరోసా ఇచ్చారు. 5,386 మందికి రూ. 5 కోట్లు నిధులు విడుదల చేస్తున్నామని, 92,724 మందికి పెన్షన్లు ఇస్తున్నామని, రూ.546 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్త సుచిత్ర ఎల్లాను అడ్వైజర్ గా నియమించామని, ఏదో చేయాలన్న తపన ఉన్నందునే సుచిత్ర ఎల్లాను నియమించామని చెప్పారు. చేనేత కార్మికుడి నుంచి వినియోగదారుడి వరకు పద్ధతి ప్రకారం చేయాలని చంద్రబాబు అధికారులకు సూచించారు.

# తెలంగాణలో కమీషన్ల పాలన నడుస్తోంది

## -బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్



హైదరాబాద్ ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రజాస్వామ్యం అంటే ? ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల ద్వారా పాలన. "ఃఎ బిష్ట్రవ జూవనీజూశ్రీవ, నీట బిష్ట్రవ జూవనీజూశ్రీవ, టనీతీ బిష్ట్రవ జూవనీజూశ్రీవ" అని నిర్వచిస్తారు. కానీ మన రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం.. ప్రజల కోసం కాకుండా, కమిషన్ల కోసం, కమిషన్ల చేత, కమిషన్ల పాలనలా వ్యవహరిస్తోందని బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శించారు.గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చాలంటే కూడా కమిషన్ కావాలి. ఇందిరమ్మ ఇల్లు రావాలంటే కమిషన్ తప్పనిసరి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలంటే కూడా కమిషన్ చెల్లించాల్సిందే. కాంగ్రెస్ పాలన మొత్తం కమిషన్ల మయం అయిపోయింది. ఇలాంటి విషయాలు రోజుకో ఉదాహరణగా సామాజిక మాధ్యమాల్లో, పత్రికల్లో, ప్రజా వేదికల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.మరోవైపు, అసలు ఈ ప్రభుత్వంలో ఉన్నది కమిషన్ల కోసమే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సెక్రటేరియట్ దగ్గర బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఎలా బయట పడ్డారో మనం చూశాం. జీహెచ్ఎంసీ ఆవరణలో కూడా "కమిషన్ల కోసమే ఉన్నాం" అన్నట్టుగా వార్తలు వచ్చాయి. ప్రతి రోజూ అధికారులు ఏసీబీకి పట్టుబడుతున్నారు. కమిషన్లు తీసుకుంటూ, రెడ్ హ్యాండెడ్ గా అందులో చిక్కుకుంటున్నారన్నారు.. ఈ సంఘటనలన్నీ పాలన ఎలా ఉందో స్పష్టంగా చెబుతున్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరే.. "కమిషన్ లేనిదే పని జరగదు" అన్నట్టు ఉంది. పాలన అంటే ప్రజల కోసమని కాదు, కమిషన్ల కోసమే అని స్పష్టంగా కనిపిస్తోంది.ఈ పరిస్థితుల్లో.. జనంలో ఓడిపోయిన రేవంత్ రెడ్డి గారు, ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికవ్వడం దురదృష్టకరం.బెయిల్ పై ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యాడు... రేవంత్ ...! ప్రధాని నరేంద్ర మోదీ గారిని విమర్శించే స్థాయి నీదికాదు.బెయిల్ మీద ఉన్నటువంటి ఒక వ్యక్తి, విచారణను ఎదుర్కొంటున్న వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాడు. ఇప్పుడు ఆయన కుర్చీని కాపాడుకోవడం కోసమే ఇ షా ట న ం నా ం ం గా మాట్లాడుతున్నాడు.బ్రీఫ్‌కేసులు, సూట్‌కేసులు పంచుతూ ముఖ్యమంత్రి కుర్చీని కాపాడుకుంటూ, కమిషన్ల ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్న వ్యక్తి రేవంత్.. ప్రధాని నరేంద్ర మోదీ గారిపై విమర్శలు చేసే స్థాయి రేవంత్ ది కాదని హెచ్చరిస్తున్నాం.ఓటుకి నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి, ఇప్పటికీ బెయిల్ మీద ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డి. ఆయనకు బాసటగా ఉన్నవారు.. బెయిల్ మీద ఉన్న మరో వ్యక్తి రాహుల్ గాంధీ. సూట్‌కేసులు అందిస్తేనే బాసట లభించే విధంగా వీరి మధ్య సంబంధం ఉంది. ఇదే కమిషన్ల పాలనలోని నిజమైన చిత్రం.అప్పుడు కవిత కోసం కేసీఆర్.. రేవంత్ ను కాపాడితే.. ఇప్పుడు రేవంత్ రెడ్డి.. కవిత కోసం కేసీఆర్ ను కాపాడుతున్నాడు. అప్పుడూ కవిత ప్లాన్ లో రేవంత్ రెడ్డి నడిస్తే.. ఇప్పుడు రేవంత్ ప్లాన్‌లో కవిత నడుస్తున్నారు. ఇది క్విడ్ ప్రో కో "నువ్వు నాకు, నేను నీకు'' అన్న రాజకీయ ఒప్పందంలో భాగమే.రేవంత్..! కుట్రల రాజకీయాలకు రోజులు దగ్గర పడ్డాయి, నీ పదవికాలం లెక్క పెట్టుకో. ఐదేళ్ల సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటివరకు రెండు సంవత్సరాలు దాటిపోయాయి. పార్లమెంటు ఎన్నికలయ్యి కూడా సంవత్సరం దాటింది. నీ పదవికాలం కూడా 20 నెలలు దాటింది. రానున్న రోజుల్లో నిన్ను ఇంటికి పంపించడం ఖాయమన్నారు.

# 9న భువనగిరి స్వర్ణగిరి దేవాలయంలో గిరిప్రదక్షిణ

యాదగిరిగుట్ట ఆగస్టు 7: ఈ నెల 9 తేదీ శనివారం రోజు శ్రవణా నక్షత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకొని ఉదయం 6:00 గంటలకు తెలంగాణ యాదాద్రి తిరుమలగా పేరుగాంచిన స్వర్ణగిరి దేవస్థానంలో ( భువనగిరి మానేపల్లి హిల్స్ )గిరి ప్రదక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు వేకువజామున స్వర్ణగిరి దివ్య క్షేత్రాన్ని సందర్శించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.గిరి ప్రదక్షణలో పాల్గొనాలనుకునే భక్తులందరూ హిందూ సాంప్రదాయ దుస్తులతో స్వామివారి పాదాల వద్దకు చేరుకోవాలని సూచించారు.

# హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మేడ్చల్ ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ పటేల్ మేడ్చల్ రూరల్ జిల్లా కన్వీనర్ గాలి సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాలతో పాటు ఆగస్టు14న జరిగే విభజన గాయాల స్మృతి దినం సందర్భంగా వివిధ కార్యక్రమల దృశ్య ఈరోజు గౌరవ పార్లమెంటు సభ్యులు బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ ఆఫీసు (షామీర్పేట్)నందు జిల్లాస్థాయి కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మరియు జిల్లా నాయకులు, ఎస్టి మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు బిక్కు నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుమ్మిడి శోభా రెడ్డి, నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షులు చిత్తరంజన్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సుగుణారెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కొల్లపుడి విజయలక్ష్మి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బండారు పవన్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఎరదాల మహేందర్ యాదవ్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు భోగారం వెంకటరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పాతూరి ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా కో కన్వీనర్ నంద్యాల శ్రీనివాస్ , మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బుద్దవరం లక్ష్మీ వేణుగోపాల్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగం అర్జున్జిల్లాలోని వివిధ మోర్చాల అధ్యక్షులు, జిల్లాలోని వివిధ మండలాల, మున్సిపాలిటీల, కార్పొరేషన్ లోని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# విదేశాంగ విధానంలో మోదీ ప్రభుత్వం ఫెయిల్ : మల్లికార్జున్ ఖర్గే

న్యూ డిల్లీ ఆగస్టు 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదనంగా 25శాతం పన్నులు ప్రకటించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో పన్నులు విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. దాంతో భారత్ నుంచి అమెరికా మార్కెట్‌కు వెళ్లే వస్తులపై మొత్తం 50శాతం పన్నులు విధించనున్నారు. అయితే, ట్రంప్ టారిఫ్స్‌పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుర్పించారు. సుంకాలు నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం వైఫల్యంగా అభివర్ణించారు. భారత దౌత్యం బలహీనంగా, గందరగోళంగా కనిపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ చర్యలు తీసుకున్నారన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రధాని మోదీ పూర్తిగా విఫలమయ్యారని.. ట్రంప్ నిరంతరం భారత్‌పై ఒత్తిడిని తీసుకువస్తున్నారని ఆరోపించారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తుండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ట్రంప్.. భారత్ నుంచి అమెరికాకు వచ్చే అనేక ఉత్పత్తులపై అదనంగా 25శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ 25శాతం సుంకాలు ఆగస్టు 7 నుంచి అమలులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే 25శాతం అదనపు సుంకాలను ప్రకటించారు. దాంతో మొత్తం సుంకాలు 50శాతానికి చేరాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు.అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేకపోయారని.. మంత్రులు నెలల నుంచి చర్చల గురించి మాట్లాడుతున్నారని.. మరికొందరు వాషింగ్టన్‌లో మకాం వేసినా ఏం జరుగలేదన్నారు. ఈ క్రమంలో పెద్ద దెబ్బ తగిలిందని.. అయినా ప్రధాని మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. ఆరునెలలుగా మోదీ ప్రభుత్వం అమెరికాతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేకపోయిందని.. ట్రంప్ భారత్‌ను బెదిరిస్తూ వస్తున్నా.. మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ట్రంప్ బ్రిక్స్, వందశాతం సుంకాలపై వ్యాఖ్యానించినా ప్రధాని ఏమీ మాట్లాడలేదన్నారు. అమెరికా సుంకాల విధానంపై, ఆర్థిక పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 50శాతం సుంకాలతో దాదాపు రూ. 3.75 లక్షల కోట్ల ఆర్థిక భారం పడుతుందన్నారు. వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈ, పాడి పరిశ్రమ, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఔషధాలు, పెట్రోలియం, వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ప్రభావితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# పెన్‌పహాడ్ మండలంలో తెలంగాణ ఫుడ్ కమిషన్ విస్తృత పర్యటన



పెన్‌పహాడ్, ఆగస్టు 07 : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో గురువారం తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు రంగినేని శారద, ములుకుంట్ల భారతి, భూక్య జ్యోతి విస్తృతంగా పర్యటించారు. మొదటగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మండల వైద్యాధికారి డాక్టర్ రాజేశ్‌తో కలిసి ఓపి, ఆపరేషన్ గది. మందుల గది. రోగుల గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ ఆవరణలోమొక్కలు నాటారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ 3 సెంటర్. అంగన్‌వాడీ 1 సెంటర్‌ను పరిశీలించారు. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు ఎందుకు లేవు అని అడుగగా మూటగట్టి అటకెక్కించిన ఆట వస్తువులను తీసి చిన్నారుల ముందు కుప్పలుగా పోయడంతో అంగన్‌వాడీ టీచర్లపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బొమ్మలు చూపించి చిన్నారులను ఇవి ఏ బొమ్మలు అని అడుగగా చిన్నారులు చెప్పకపోవడం, ఆటపాటల్లో చురుకుగా లేకపోవడంతో చిన్నారులకు ప్రతిరోజు మీరు ఏం చెప్తున్నారని ప్రశ్నించారు. చిన్నారులపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం. గుడ్లను పెట్టాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం మల్లారెడ్డితో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నత చదువులు చదివి, ట్రైనింగ్ పొంది ఉన్న నేపథ్యంలో పిల్లలకు నాణ్యమైన బోధనను అందించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, డీఆర్‌డీఏ అప్పారావు, జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రసాద్, జిల్లా హౌసింగ్ బోర్డ్ అధికారి మోహన్ రావు, డీటీఓ శంకర్‌రావు, డీడబ్ల్యూఓ దయానందరాణి, ఐ ఎన్ పి ఆర్ మల్లేశ్, జిల్లా బీసీ వెల్‌ఫేర్ అధికారి ఎల్.శ్రీనివాస్. ఐసీడీఎస్ సీడీపీఓ కిరణ్మయి, ఎంఈఓ డాక్టర్ రాజేశ్. ఎంఈఓ ఎన్. రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయ్, చంద్రిక. ఉపేంద్ర, అనిశా, స్వప్న, సునీత, అంగన్‌వాడీ టీచర్లు విజయ, ఊర్మిళ పాల్గొన్నారు.

# చేతిరాతే విద్యార్థి భవితకు చేయూత : ఎజాస్ అహ్మద్



మెదక్, ఆగస్టు 5:చేతిరాతే విద్యార్థి భవితకు చేయూతనిస్తుందని ప్రముఖ చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్ అన్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం చేతిరాత గుండ్రంగా ఎలా రాయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు.

పాఠశాల విద్యార్థి దశలో అందంగా రాయడం వలన నేర్పించడం ఎంత అవసరం ఉందన్నారు.

చేతిరాత మనిషి మనసును అదుపులో ఉంచుతుంది. నిర్మాణాత్మకంగా ఆలోచింపజేస్తుందని.. స్వయం క్రమశిక్షణను పెంపొందింపచేస్తుందని పేర్కొన్నారు. మనిషి అంతసందర్భానికి మనోజ్ఞమైన భాష్యం అది పాఠకుల హృదయాలు రంజింప చేస్తే సువర్ణ రసఝరీ అని ఒక కవి అన్నట్లు ఉపాధ్యాయులు అక్షర రమ్యతను చేజిక్కించుకొని విద్యార్థుల గుండె గరిసలో ఆణిముత్యాల సంపదను నింపి నిత్య విద్యకృషివలురు కావాలని ఆయన ఆకాంక్షించారు.శ్రద్ధ, ఆసక్తి పట్టుదల ఉండే ఆచార్యులు దేనినైనా సాధించవచ్చు. తెలుగు, హిందీ, ఆంగ్లం మూడు భాషలపైన అందమైన చేతిరాతను విద్యార్థులకు ఎజాస్ అహ్మద్ స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దండియాల విమల, ఉపాధ్యాయులు రాజమండ్రి శ్రీరాములు, వేణుగోపాల్ రెడ్డి, యాదగిరి, జ్యోతిలక్ష్మి, సంపత్ చందు, రవి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చెందిన భారతదేశ విధానాలు, దిశకు కర్తవ్య భవన్ మార్గనిర్దేశం చేస్తోంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 7:ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ఈరోజు కర్తవ్య భవన్–3 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఆగస్టు 15 కంటే ముందే క్రాంతికారక మాసమైన ఈ నెల మరో చారిత్రాత్మక ఘట్టానికి సాక్ష్యంగా నిలుస్తోందని అన్నారు. ఆధునిక భారత్ నిర్మాణంతో ముడిపడి ఉన్న కీలక మైలురాళ్లను దేశం ఒకదాని తర్వాత ఒకటి దాటుతోందని ప్రధానంగా చెప్పారు. ఢిల్లీ గురించి మాట్లాడుతూ మౌలిక సదుపాయాల విషయంలో ఇటీవల జరిగిన పురోగతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కర్తవ్య పథ్, కొత్త పార్లమెంట్ భవనం, కొత్త రక్షణ కార్యాలయాల సముదాయం, భారత్ మండపం, యశోభూమి, అమరవీరులకు సంబంధించిన జాతీయ యుద్ధ స్మారక చిహ్నం, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహంతో పాటు ప్రస్తుత ప్రారంభోత్సవం జరుగుతోన్న కర్తవ్య భవన్‌లను ప్రస్తావించారు. ఇవి కేవలం కొత్త భవనాలు లేదా సాధారణ మౌలిక సదుపాయాలు కాదని ప్రధానంగా చెబుతూ.. అమృత్ కాలంలో అభివృద్ధి చెందిన భారతదేశాన్ని రూపొందించే విధానాలు వీటిలో తయారౌతాయని అన్నారు. రాబోయే దశాబ్దాల్లో దేశం ప్రయాణించే మార్గం కూడా వీటిలోనే నిర్ణయం అవుతుందని పేర్కొన్నారు. కర్తవ్య భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా అందరికీ ఆయన అభినందనలు తెలిపారు. నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, కార్మికులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

కర్తవ్య పథ్, కర్తవ్య భవనం రెండూ భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిధ్వనిస్తాయన్న ఆయన.. విస్తృత ఆలోచనల తర్వాత ఈ భవనానికి 'కర్తవ్య భవన్' అని పేరు పెట్టినట్లు తెలిపారు. భగవద్గీతను ఉటంకిస్తూ లాభనష్టాల ఆలోచనలను దాటుకొని బాధ్యతలు నిర్వర్తించాలన్న శ్రీ కృష్ణుడి బోధనలను ప్రధాని గుర్తు చేశారు. భారతీయ సంస్కృతిలో 'కర్తవ్యం' అనే పదం బాధ్యతకే పరిమితం కాదని, కార్యాచరణ ఆధారిత భారతీయ తత్వానికి సంబంధించిన సారాంశాన్ని తెలియజేస్తోందని ప్రధానంగా చెప్పారు. సొంత అనే భావనను దాటి సమష్టి దృక్పథాన్ని అలవరుచుకునే నిజమైన గొప్ప భావనే అసలైన కర్తవ్యం అని వివరించారు. కర్తవ్య అనేది కేవలం ఒక భవనం పేరు కాదని, కోట్లాది మంది భారతీయుల కలలను సాకారం చేసుకునే ఒక పవిత్ర స్థలమని ప్రధానంగా చెప్పారు. “కర్తవ్యం అనేది ప్రారంభం, విధి రెండింటిని తెలియజేస్తోంది. ఇది కరుణ, శ్రద్ధతో కట్టుబడి ఉంటుంది. ఇది కలల సౌధం, సంకల్పాల ఆశ, ప్రయత్నానికి చిహ్నం” అని ప్రధాని అన్నారు. కర్తవ్యం ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే సంకల్ప శక్తి అని పేర్కొన్నారు. కోట్లాది మంది ప్రజల హక్కులను పరిరక్షించడానికి పునాదే కర్తవ్యం అని ప్రధానంగా అన్నారు. కర్తవ్యం అనేది భారతమాత శక్తికి వాహకమని, 'నాగరిక్ దేవో భవ' అనే మంత్రాన్ని జపించడమేనని తెలిపారు. దేశం పట్ల భక్తితో చేసే ప్రతి పని కర్తవ్యమేనని పేర్కొన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దశాబ్దాలుగా భారతదేశ పరిపాలనా యంత్రాంగం బ్రిటిష్ వలసరాజ్యాల కాలంలో నిర్మించిన భవనాల నుంచే పనిచేసిందన్నారు. ఈ పాత భవనాలలో పని వాతావరణం అధ్వాన్నంగా ఉందని.. వాటిలో తగినంత స్థలం, వెలుతురు, గాలి లేదని చెప్పారు. హోం మంత్రిత్వ శాఖ వంటి ముఖ్యమైన మంత్రిత్వ శాఖ దాదాపు 100 సంవత్సరాలుగా తగినంత మౌలిక సదుపాయాలు లేకుండా ఒకే భవనంలో ఎలా పనిచేసిందో ఊహించటం కష్టమని వ్యాఖ్యానించారు. భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు ప్రస్తుతం ఢిల్లీ అంతటా 50 వేర్వేరు ప్రదేశాల నుంచి పనిచేస్తున్నాయన్న ఆయన.. ఈ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన భవనాలు చాలా వరకు అద్దెపై నడుస్తున్నవేనని అన్నారు. అద్దె కోసం చేస్తోన్న వార్షిక వ్యయం రూ. 1500 కోట్లు ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని అన్నారు. ఇవన్నీ అక్కడక్కడ ఉన్నప్పటికీ.. ఇంత పెద్ద మొత్తాన్ని ఖర్చు చేయాల్సి వస్తోందని వివరించారు. ఈ వికేంద్రీకరణ కారణంగా ఉన్న ప్రయాణ సమస్యను కూడా చెప్పారు. ఒక శాఖ నుంచి ఇంకో శాఖకు రోజుకు 8,000 నుంచి 10,000 మంది ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారని.. ఫలితంగా వందలాది వాహనాలు రోడ్ల మీదికి రావటంతో పాటు వ్యయం, ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని తెలిపారు. వీటి వల్ల విలువైన సమయం వృథా అయి పరిపాలనా సామర్థ్యం ప్రత్యక్షంగా తగ్గుతోందని ప్రధానంగా పేర్కొన్నారు.

భారత్‌కు 21వ శతాబ్దపు ఆధునిక భవనాలు అవసరమన్న ప్రధానమంత్రి.. సాంకేతికత, భద్రత, సౌలభ్యం పరంగా ఉన్న భవనాల అవసరాన్ని ప్రధానంగా తెలియజెప్పారు. అటువంటి భవనాలు సిబ్బందికి సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని, త్వరితగతిన నిర్ణయం తీసుకోవడానికి వీలు కల్పించాలని , సేవలను సజావుగా అందించేలా చూసుకోవాలని పేర్కొన్నారు. కర్తవ్య భవన్ వంటి భారీ భవనాలను సమగ్ర దృక్పథంతో కర్తవ్య మార్గం చుట్టూ నిర్మిస్తున్నామని.. మొదటి కర్తవ్య భవన్ పూర్తయినప్పటికీ, అనేక ఇతర కర్తవ్య భవనాల నిర్మాణం వేగంగా సాగుతోందని తెలిపారు. కార్యాలయాలను కొత్త సముదాయాలకు మార్చిన తర్వాత, ఉద్యోగులు మెరుగైన పని వాతావరణంతో పాటు అవసరమైన సౌకర్యాలను కలిగి ఉంటారని, తద్వారా వారి ఉత్పాదకత పెరుగుతుందన్నారు. అక్కడక్కడ ఉన్న మంత్రిత్వ శాఖ కార్యాలయాల అద్దెకు ప్రస్తుతం ఖర్చు చేస్తోన్న రూ. 1,500 కోట్లను కూడా ప్రభుత్వం ఆదా చేస్తుందని పేర్కొన్నారు.

"కొత్త రక్షణ సముదాయాలు సహా భారీ కర్తవ్య భవన్, ఇతర ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు భారత్ వేగానికి నిదర్శనం మాత్రమే కాదు, దేశానికి ఉన్న ప్రపంచ దృక్పథాన్ని కూడా తెలియజేస్తాయి” అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. భారతదేశం ప్రపంచానికి అందిస్తోన్న దార్శనికతను దేశం కూడా పాటిస్తోందని, ఇది మౌలిక సదుపాయాల అభివృద్ధిలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచానికి మిషన్ లైఫ్, 'ఒకే భూమి, ఒకే సూర్యుడు, ఒకే గ్రిడ్' వంటి కార్యక్రమాలను ఇచ్చిందని, ఇవి మానవాళి భవిష్యత్తుపై ఆశను తెలియజేస్తున్నాయని తెలిపారు. కర్తవ్య భవన్ వంటి ఆధునిక మౌలిక సదుపాయాలు ప్రజానుకూల స్ఫూర్తిని, వాతావరణ అనుకూల నిర్మాణాన్ని కలిగి ఉన్నాయని తెలియజేశారు. కర్తవ్య భవన్‌పై సౌర ఫలకాలను ఏర్పాటు చేసినట్లు తెలిపిన ఆయన ఈ భవనాల్లో అధునాతన వ్యర్థ నిర్వహణ వ్యవస్థలు కూడా ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఏర్పాటవుతోన్న హరిత భవనాల విషయంలో దార్శనికతకు అనుగుణంగా వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దేశాన్ని పురోగమనంలో నిలపడంలో సమగ్ర దృక్పథంతో ప్రభుత్వం నిమగ్నమై ఉందని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. దేశంలోని అన్ని ప్రాంతాలూ నేడు ప్రగతి పథంలో నిలిచాయని, అభివృద్ధి చేరని ప్రాంతమంటూ ఏదీ లేదని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించగా.. దేశవ్యాప్తంగా 30,000కు పైగా పంచాయతీ భవనాలనూ నిర్మించినట్టు ఆయన పేర్కొన్నారు. కర్తవ్య భవన్ వంటి కీలక నిర్మాణాలతోపాటు పేదల కోసం నాలుగు కోట్లకు పైగా పక్కా ఇళ్లను నిర్మించామని శ్రీ మోదీ తెలిపారు. దేశవ్యాప్తంగా 300కు పైగా కొత్త వైద్య కళాశాలలను నిర్మించామనీ, అదే సమయంలో జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్నీ పోలీసు స్మారకాన్నీ కూడా ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ఢిల్లీలో భారత్ మండపాన్ని నిర్మించగా.. దేశవ్యాప్తంగా 1,300కు పైగా అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రధానమంత్రి వివరించారు. గత పదకొండేళ్లలో దాదాపు 90 కొత్త విమానాశ్రయాల నిర్మాణంతో దేశ ప్రగతి ప్రస్థానం వేగం పుంజుకుందని, అలాగే యశోభూమి వైభవమూ ఈ విప్లవాత్మక మార్పులను కళ్లకు కడుతోందని ప్రధానమంత్రి అన్నారు.

హక్కులు, విధులు అంతర్గతంగా ముడిపడి ఉన్నాయనీ, విధులను నిర్వర్తించడం హక్కుల పునాదిని బలపరుస్తుందనీ మహాత్మాగాంధీ గట్టిగా నమ్మేవారని ప్రధానమంత్రి గుర్తుచేశారు. పౌరులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని, అదే సమయంలో ప్రభుత్వమూ పూర్తి అంకిత భావంతో తన బాధ్యతలను నిర్వర్తించాలని శ్రీ మోదీ అన్నారు. ప్రభుత్వం నిజాయితీగా పనిచేస్తే పాలనలో అది ప్రతిబింబిస్తుందని స్పష్టం చేశారు. గత దశాబ్దం దేశంలో 'సుపరిపాలన దశాబ్దం'గా పేరెన్నికగన్నదని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. సంస్కరణలు నదీతలం వంటివైతే.. సుపరిపాలన వాహిని, అభివృద్ధి రెండూ దాని శాఖల వంటివన్నారు. సంస్కరణలు నిరంతరమైనవని, కాలావధితో కూడిన ప్రక్రియలని చెప్పారు. భారత్ ఎప్పటికప్పుడు ముఖ్యమైన సంస్కరణలెన్నింటినో చేపట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వం–పౌరుల మధ్య సంబంధాల బలోపేతం, జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, మహిళా సాధికారత, పరిపాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరిస్తూ... “భారత సంస్కరణలు స్థిరమైనవి మాత్రమే కాదు.. క్రియాశీలమైనవి, దార్శనికమైనవి” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఈ రంగాల్లో భారత్ ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు చేస్తోందన్నారు. “గత పదకొండేళ్లుగా.. పారదర్శకమైన, సునిశితమైన, ప్రజా కేంద్రీకృతమైన పరిపాలన నమూనాను భారత్ రూపొందించింది'' అని ప్రధానమంత్రి వివరించారు.

తాను ఏ దేశానికి వెళ్లినా జేఏఎం త్రయం (జన్‌ధన్, ఆధార్, మొబైల్) సర్వత్రా ప్రశంసలందుకుంటోందని ప్రధానమంత్రి చెప్పారు. జేఏఎం వల్ల దేశంలో ప్రభుత్వ పథకాల పంపిణీ పారదర్శకంగా మారిందని, అవి పక్కదారి పట్టకుండా ఉన్నాయని వివరించారు. రేషన్ కార్డులు, గ్యాస్ సబ్సిడీలు, స్కాలర్‌షిప్పుల వంటి పథకాలకు సంబంధించి.. మనుగడలో లేని లబ్ధిదారులే దాదాపు 10 కోట్ల మంది ఉండడం ఆశ్చర్యకరమన్నారు. వారిలో చాలా మంది అసలింకా పుట్టనే లేదని, అయినా పథకాలు పొందేవారని అన్నారు. గత ప్రభుత్వాలు ఈ నకిలీ లబ్ధిదారుల పేర్లపై నిధులను బదిలీ చేశాయని, ఆ విధంగా అక్రమంగా నిధులను మళ్లించారని శ్రీ మోదీ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 10 కోట్ల తప్పుడు పేర్లను లబ్ధిదారుల జాబితాల నుంచి తొలగించినట్టు తెలిపారు. ఈ చర్య దేశంలో రూ. 4.3 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం పక్కదారి పట్టకుండా కాపాడినట్టు తాజా గణాంకాల ప్రకారం తెలుస్తోందన్నారు. ఈ భారీ మొత్తాన్ని ఇప్పుడు అభివృద్ధి కార్యక్రమాల కోసం ఉపయోగిస్తున్నామన్నారు. దాంతో నిజమైన లబ్ధిదారుల ప్రయోజనాలు, జాతీయ వనరులు రెండింటికీ రక్షణ లభించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

అవినీతి, నిధుల దారి మళ్లింపులే కాకుండా కాలం చెల్లిన నియమ నిబంధనలు కూడా చాలా కాలంగా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని, అవి ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియకు అవరోధం కలిగిస్తున్నాయని చెప్పిన శ్రీ మోదీ.. ఈ సమస్యను పరిష్కరించడం కోసం వాడుకలో లేని 1,500కు పైగా చట్టాలను రద్దు చేసినట్టు తెలిపారు. వలస పాలన అవశేషాలుగా ఉన్న ఆ నియమ నిబంధనలు దశాబ్దాలుగా పాలనకు ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. చిన్నచిన్న కార్యకలాపాలకు కూడా గతంలో అనేక పత్రాలు సమర్పించాల్సి ఉండేదని చెప్తూ.. ఆ అనుమతిం రమైన భారం కూడా సవాళ్లను కలిగించిందన్నారు. గత పదకొండేళ్లలో 40,000కు పైగా అనుమతులను తొలగించామని, ఈ హేతుబద్ధీకరణ స్థిరమైన వేగంతో కొనసాగుతోందని ప్రధానమంత్రి తెలిపారు. గతంలో వివిధ ప్రభుత్వ విభాగాలు, మంత్రిత్వ శాఖల మధ్య బాధ్యతలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఉండడం వల్ల జాప్యాలు, అవరోధాలు ఏర్పడ్డాయన్నారు. పనితీరును మెరుగురచడం కోసం అనేక విభాగాలను ఏకీకృతం చేయడంతోపాటు అదనంగా ఉన్న విభాగాలను తొలగించామన్నారు. అలాగే అవసరమైన చోట మంత్రిత్వ శాఖల విలీనమో లేదా కొత్తగా ఏర్పాటు చేసే దిశగానో చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. జల భద్రత కోసం జలశక్తి మంత్రిత్వ శాఖ, సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి సహకార మంత్రిత్వ శాఖ, మత్స్యకార రంగానికి ప్రాధాన్యమిస్తూ మొదటిసారిగా మత్స్యకార మంత్రిత్వ శాఖ, యువతను సాధికారులుగా తీర్చిదిద్దడం కోసం నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వ శాఖ వంటి కీలక శాఖల ఏర్పాటును శ్రీ మోదీ ఉదాహరించారు. ఈ సంస్కరణలు పాలన సామర్థ్యాన్ని పెంచాయని, ప్రజా సేవలను వేగవంతం చేశాయని చెప్పారు.

ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్తూ.. మిషన్ కర్మయోగి, ఐ గాట్ డిజిటల్ వేదికల వంటి కార్యక్రమాలను ప్రధానమంత్రి వివరించారు. ఇవి సాంకేతిక, వృత్తిపరమైన శిక్షణతో ప్రభుత్వ ఉద్యోగులను సాధికారులను చేస్తున్నాయన్నారు. ఇ–ఆఫీస్, ఫైల్ ట్రాకింగ్, డిజిటల్ ఆమోదాల వంటి ఏర్పాట్లు పాలన ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయన్నారు. ఇవి ప్రక్రియలను వేగవంతం చేయడమే కాకుండా వాటిని పారదర్శకంగా, జవాబుదారీగా మారుస్తున్నాయన్నారు.

కొత్త భవనంలోకి రావడంతో నవోత్తేజం జనించిందని, సభ్యుల శక్తియుక్తులను ఇది గణనీయంగా పెంచిందని ప్రధానమంత్రి అన్నారు. సభ్యులంతా ఈ కొత్త భవనంలో అదే ఉత్సాహంతో, అంకితభావంతో బాధ్యతలు నిర్వర్తించాలని కోరారు. పదవితో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ తమ పదవీకాలాన్ని చిరస్మరణీయంగా మలచుకునేలా కృషి చేయాలన్నారు. పదవీకాలం పూర్తయి సభను వీడిన తర్వాత.. దేశ సేవలో శక్తివంచన లేకుండా, అంకితభావంతో వ్యవహరించామని గర్వించేలా పనిచేయాలన్నారు.

ఫైళ్లు, డాక్యుమెంటేషన్ల పట్ల దృక్పథాన్ని మార్చుకోవాల్సిన అవసరముందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఏదైనా ఫైల్, ఫిర్యాదు లేదా దరఖాస్తు నిత్యకృత్యంగానే అనిపించవచ్చనీ, కానీ ఆ కాగితం ముక్కే ఓ వ్యక్తిలో ఎన్నో ఆశలు నింపగలదనీ గుర్తించాలన్నారు. ఒకే ఫైల్ అనేక వ్యక్తుల జీవితాలతో సంక్లిష్టంగా ముడిపడి ఉంటుంది. ఈ విషయాన్ని వివరిస్తూ.. లక్ష మంది ప్రజలకు సంబంధించిన ఒక ఫైల్ ఒక్క రోజు ఆలస్యమైనా దాని వల్ల లక్ష పనిదినాలను నష్టపోవాల్సి వస్తుందని ప్రధానమంత్రి చెప్పారు. సౌలభ్యాన్ని బట్టి పనిచేయడమో లేదా సర్వ సాధారణంగా ఆలోచించడమో కాకుండా.. సేవ చేయడానికి ఉన్న అపారమైన అవకాశాన్ని గుర్తిస్తూ ఈ మనస్తత్వంతో అధికారులు బాధ్యతలు నిర్వర్తించాలని కోరారు. కొత్త ఆలోచన విప్లవాత్మక మార్పులకు బీజం వేయగలదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా కర్తవ్య స్ఫూర్తితో దేశ పురోగమనంపై అంకితభావంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. బాధ్యతల నుంచే దేశ అభివృద్ధి స్వప్నం వికసిస్తుందని వారికి గుర్తుచేశారు.

విమర్శలకు ఇది సమయం కానప్పటికీ, కచ్చితంగా ఇది ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

భారతదేశంతో సమానంగా స్వాతంత్ర్యం పొందిన అనేక దేశాలు వేగంగా పురోగమించాయని, అయితే వివిధ చారిత్రక సవాళ్ల కారణంగా భారతదేశ పురోగతి వాటితో పోలిస్తే తక్కువగానే ఉందని ఆయన అన్నారు. అయితే ఈ సవాళ్లు భావితరాలకు కూడా చేరకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. తమ ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన ప్రయత్నాలను వివరిస్తూ, పార్లమెంట్ పాత భవనంలో తీసుకున్న ఎన్నో ముఖ్యమైన నిర్ణయాలు, విధానాలు 25కోట్లమంది పేదరికం నుంచి బయటపడేందుకు దోహదపడ్డాయని చెప్పారు. ఇప్పుడు కొత్త భవనాలలో మరింత సామర్థ్యంతో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించే దిశగా వేగంగా అడుగులు వేస్తూ అభివృద్ధి చెందిన భారత్ కలను సాకారం చేయడమే లక్ష్యమని ప్రధాని తెలిపారు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాల విజయగాథలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రపంచంలోనే భారత్ ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు భాగస్వాములందరూ సమష్టిగా కృషి చేయాలని శ్రీ మోదీ పిలుపునిచ్చారు. జాతీయ ఉత్పాదకతను పెంచడానికి నిబద్ధతతో పనిచేయాలని కోరారు. పర్యాటకం గురించి చర్చ జరిగితే అందులో భారత్ అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా గుర్తింపు పొందాలని అన్నారు. బ్రాండ్‌ల గురించి మాట్లాడినప్పుడు ప్రపంచం భారతీయ సంస్థలవైపు చూడాలని, విద్య కోసం ఆలోచిస్తే ప్రపంచం నలుమూలల నుంచి విద్యార్థులు భారత్ నే ఎంపిక చేసుకునే పరిస్థితి ఉండాలని ఆయన అన్నారు. భారత్ సామర్థ్యాలను బలోపేతం చేయడం ఉమ్మడి ప్రయత్నంగా, వ్యక్తిగత లక్ష్యంగా మారాలని స్పష్టం చేశారు.

విజయవంతమైన దేశాలు ముందుకు సాగుతున్నప్పుడు, అవి తమ సానుకూల వారసత్వాన్ని విడిచిపెట్టవని, దానిని కాపాడుకుంటాయని పేర్కొన్న శ్రీ మోదీ, 'వికాస్ ఔర్ విరాసత్' దార్శనికతతో భారత దేశం పురోగమిస్తోందని తెలిపారు. నేడు ప్రారంభించిన కొత్త కర్తవ్య భవన్ లో చారిత్రక ప్రాధాన్యం గల ఉత్తర, దక్షిణ బ్లాక్ లు భారత సజీవ వారసత్వ భాగాలుగా రూపుదిద్దుకుంటాయని ప్రధానమంత్రి ప్రకటించారు. ఈ సుప్రసిద్ధ భవనాలను “యుగే యుగీన్ భారత్ సంగ్రహాలయ'' పేరుతో పబ్లిక్ మ్యూజియంలుగా మారుస్తామని, దీని ద్వారా ప్రతి పౌరుడు భారతదేశ సుసంపన్నమైన నాగరిక ప్రయాణాన్ని వీక్షించడానికి, అనుభూతి చెందడానికి వీలు కల్పిస్తుందని ఆయన అన్నారు. కొత్త కర్తవ్య భవన్ లోకి ప్రజలు ప్రవేశించగానే, ఈ ప్రదేశాల్లో నిక్షిప్తమైన స్ఫూర్తిని, వారసత్వాన్ని తమతో తీసుకువెళతారని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. కర్తవ్య భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా భారత ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# వ్యవసాయంలో బయోటెక్నాలజీ వినియోగం పెరగాలి

## - రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో వక్తల ఉద్ఘాటన




హైదరాబాద్, ఆగష్టు 7:వ్యవసాయ రంగంలో బయోటెక్నాలజీ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. జన్యుపరివర్తన, జీన్ ఎడిటింగ్ వంటి ఆధునిక పద్ధతులు కీలకంగా ఉంటాయని నిపుణులు వివరించారు. వాతావరణ మార్పులు, తెగుళ్లు, దిగుబడులు వంటి సమస్యలను వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం బయోటెక్నాలజీ సాధనాల వినియోగంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. 'పంటల అభివృద్ధికి బయోటెక్నాలజీ వినియోగం: ముఖ్యమైన పురోగతులు' అనే శీర్షికతో జరిగిన ఈ సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బయోటెక్ కన్సార్టియం ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించాయి. ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా మద్దతు ఇచ్చింది.

ఈ సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌ఎం సుందరం మాట్లాడుతూ బయోటెక్నాలజీ ఆవిష్కరణలను అర్థం చేసుకోవడానికి, సమర్థవంతంగా ప్రజలకు వివరించడానికి, బాధ్యతగా అమలు చేయడానికి అధికారుల నుంచి పాలసీ మేకర్ల వరకు సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ గత కొన్ని దశాబ్దాలుగా వ్యవసాయ ఉత్పాదకతలో పురోగతి సాధించిందన్నారు. అయినా, భవిష్యత్తు అవసరాల కోసం భూమి విస్తీర్ణాన్ని పెంచడం కాకుండా, సాంకేతిక పురోగతిపై దృష్టి పెట్టాలని కోరారు.

ఈ సందర్భంగా బయోసీడ్స్ డివిజన్, డీసీఎం శ్రీరామ్ లిమిటెడ్ డాక్టర్ పరేష్ వర్మ మాట్లాడుతూ బయోటెక్నాలజీ అనేది తుది లక్ష్యం కాదన్నారు. కానీ స్థిరమైన వ్యవసాయం సాధించడానికి ముఖ్యమైన మార్గమన్నారు. జన్యు మార్పు ద్వారా తక్కువ ఎరువులు, తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పంటలు సాధ్యమన్నారు. దీని వల్ల రైతులకు తక్కువ ఖర్చు అవుతుందన్నారు. పంటలు వాతావరణ మార్పులు, తెగుళ్లకు తట్టుకునేలా మారతాయని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అయిన వాతావరణ మార్పులు, తెగుళ్ల, పోషక లోపాలు పరిష్కరించేందుకు ఇప్పుడు శాస్త్రవేత్తలకు జన్యు మార్పు, జీనోమ్ ఎడిటింగ్ అనే రెండు శక్తివంతమైన టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ఈ సందర్భంగా బయోటెక్ కన్సార్టియం ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ విభా ఆహూజా మాట్లాడుతూ శాస్త్రీయ అభివృద్ధిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, రైతు సముదాయాలతో చర్చలు జరపడం అవసరమని సూచించారు. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ ప్రయోగశాలల్లో చాలా పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. అవన్నీ ప్రజలకు ఉపయోగపడాలంటే సమర్థవంతంగా అమలు చేసే మార్గాలు కావాలన్నారు. అందుకే ఇటువంటి వర్క్‌షాప్‌లు అవసరం ఎంతో ఉందన్నారు. బయోటెక్నాలజీ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దాన్ని బాధ్యతతో ఎలా ఉపయోగించాలో ప్రజలకు వివరించడంలో బయోటెక్ కన్సార్టియం ఇండియా లిమిటెడ్ ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు.

ఈ సందర్భంగా ఐసీఏఆర్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వైజీ ప్రసాద్ మాట్లాడుతూ పరిశోధనల నుంచి విస్తరణ సేవల వరకు ఒక సమగ్ర దృక్పథాన్ని అవలంబించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. బయోటెక్నాలజీని వేరుగా చూసినంత మాత్రాన అది ఫలితం ఇవ్వదన్నారు. ఇది ఇప్పటికే ఉన్న వ్యవస్థల్లో ఎంతగా అనుసంధానం అవుతుంది?, మన సిబ్బందికి ఎంత సమర్థంగా శిక్షణ ఇస్తాం?, రైతుల సందేహాలను ఎంతగా తీర్చగలుగుతాం? అన్న దానిపై విజయం ఆధారపడి ఉంటుందన్నారు. వ్యవస్థపై రైతుల్లో నమ్మకం అత్యంత ఆవశ్యకమన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చలు జరిగాయి. ఈ చర్చలు పత్తి పంటల నుంచి జన్యు సవరణ పంటలపై ఉన్న నియంత్రణ విధానాల వరకు చేశారు. ఈ చర్చలో ఫీల్డ్ ట్రయల్స్ కు అనుమతుల ప్రక్రియను సరళతరం చేయాలని, రైతులు, ప్రజలతో కమ్యూనికేషన్ చేయడానికి కొత్త వ్యూహాలు అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ బయోటెక్నాలజీపై చర్చలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పాలసీ తీసుకున్నా బయోటెక్నాలజీని ఎంత వేగంగా, ఎంత విస్తృతంగా అమలు చేయాలో నిర్ణయించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని చెప్పారు.

# సకలాభీష్ట ప్రదాయిని "వరలక్ష్మి దేవత"

## ప్రస్తావన :

శ్రావణ వరలక్ష్మీ వ్రతం శాస్త్రోక్తంగా జరుపుకోండి.. సకల శుభాలు పొందండి. స్త్రీలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు వరలక్ష్మీ వ్రతం ఆచరించడం తప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. "వర'అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది. భక్తితో వేడుకుంటే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. ఈ వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాన్నిచేయడంవల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుంది. సకల శుభాలు కలుగుతాయి. స్త్రీలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం తప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అనే అర్థం కూడా ఉంది. శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం రోజున తెల్లవారుజామునే నిద్రలేచి, అభ్యంగన స్నానాన్ని ఆచరించాలి. ఇంటికి ఈశాన్య భాగంలో ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టి, మండపాన్ని ఏర్పాటుచేయాలి. శ్రావణమా సంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్నిఆచరించాలి. ఆ రోజున వీలుకాకపోతే తరువాత వచ్చే శుక్రవారాలలో కూడా ఈవ్రతాన్ని చేయకోవచ్చు. వరలక్ష్మీ వ్రతానికి ఆదిదేవతయ్యోన లక్ష్మీదేవి ఒకనాటి రాత్రి సమయంలో చారుమతికి కలలో సాక్షాత్కరించింది. సువాసినులందరూ చేసే ప్రాభవ వ్రతం. 'శ్రీ వరలక్ష్మీ నమస్తు వసుప్రదే, సుప్రదే' శుక్రవారం రోజున జరుపుకునే వరలక్ష్మీ వ్రతంతో ధన, కనక, వస్తు,వాహనాది సమృ ద్ధులకు మూలం. శ్రావణ శుక్రవార వ్రతాలతో పాపాలు తొలిగి లక్ష్మీ ప్రసన్నత కలుగుతుంది.

**శ్లోకం: లక్ష్మీం క్షీర సముద్ర రాజతనయాం శ్రీరంగ ధామేశ్వరీం,**
**దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం**
**శ్రీ మన్మంద కటాక్షలబ్ధివిభవత్ బ్రహ్మేంద్ర గంగాధరాం**
**త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజం వందే ముకుందప్రియం॥**

## శ్రీ మహాలక్ష్మీ వైశిష్ట్యం:

వైకుంఠపురంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ క్షీరసాగరంలో ఉద్భవించింది. స్వర్గంలో స్వర్ణలక్ష్మి, ఇంద్రలక్ష్మి, మహారాజులపాలిట రాజ్యలక్ష్మి, స్త్రీలకు ఆమె సౌభాగ్యలక్ష్మి, వరాలనిచ్చే వరలక్ష్మి. భక్తితో వేడుకుంటే కోరిన వరాలను ప్రసాదించే కల్పవల్లి వరలక్ష్మీ దేవి. శ్రీమహావిష్ణువు దేవేరి లక్ష్మీదేవి, అష్టావతారాలలో వరలక్ష్మీ ఒకరు. మహాలక్ష్మీ సంపదల తల్లి, సంపద అనే మాటకు సనాతన ధర్మంలో అనేక అర్థాలున్నాయి. ధనం, పుష్టి, ఆరోగ్యం, మిత్రత్వం, సౌమనస్యం, శాంతి, కలహంలేని పరిస్థితి బలం అనుకూలమైన కుటుంబం, కార్యసిద్ధి, విజయం, చిరునవ్వు, ఇవన్నీ లక్ష్మీ రూపాలు. ఈ సంపదలన్నింటి సమాహార స్వరూపాన్ని లక్ష్మీదేవిగా ఉపాసించారు మహర్షులు. ఇవన్నీ శ్రీవిభూతులు. వీటిని పొందాలంటే తగిన సాధన, అర్హత ఉండాలని ధార్మిక గ్రంథాలు బోధించాయి. మహాభారతంలో భీష్ముడు గొప్ప వృత్తాంతాన్ని వివరించారు. ఒకప్పుడు దైత్యులవద్ద లక్ష్మీదేవి నెలకొని సంపదలన్నీ ప్రసాదించింది. కానీ, ఒకసారి వారిని వదలి, యోగ్యుడైన ఇంద్రుడి ముందు ప్రత్యక్షమైంది.

'శ్రీమహాలక్ష్మిని' ఉద్దేశించి అమ్మా! నువెవ్వరు? ఎందుకు వచ్చావు? ఎక్కడినుంచి వస్తున్నావు? ఎక్కడికి వెళుతున్నావు? అని ప్రశ్నించాడు దేవేంద్రుడు. అప్పుడు శ్రీమహాలక్ష్మీ దేవేంద్రుడితో సంభోదిస్తూ... ఒకప్పుడు దైత్యులు ధర్మనిరతులై, ధైర్యంతో సత్యాన్ని, సన్మార్గాన్ని వదలకుండా ఉండేవారు. అందుకే వారివద్ద నేనున్నాను. నా ఉనికితో వారంతా ఉన్నత స్థితిని, వైభవ విజయాలను అనుభవించారు. కానీ, స్వయంగా ధన మదంతో, విజయాల గర్వంతో సత్య, ధర్మాలను విడిచిపెట్టారు. ధర్మవిరుద్ధమైన భోగాల వెంట పడ్డారు. క్రోధాల్ని పెంచుకున్నారు. ఈర్ష్యాసూయలకు లోనయ్యారు. దానితో వారిని వదిలి పెట్టాను. పరిశుభ్రత, సదాచారం, క్రమశిక్షణ ఉన్నంతకాలం వారివద్ద ఉన్నాను. సధర్మాన్ని పాటించేవారివద్ద, ధైర్యంతో సత్కార్యాలు చేసేవారి చెంత నేనుండి కరుణిస్తాను. దానం, అధ్యయనం, దైవపూజ, గురుపూజ, అతిథిపూజలను పాటించేవారి ఇంట నేనుంటాను. ఇంటిని శుభ్రంగా ఉంచినవారు, స్త్రీలను గౌరవించేవారు, జితేంద్రియులు, సత్యవాదులు నా కరుణకు తగినవారు. దయామయులు, కృతజ్ఞులు, ప్రియంగా మృదువుగా మాట్లేవారు, నియమబద్ధంగా జీవించేవారు..... నా అనుగ్రహానికి పాత్రులు. వారిని నేను విడిచిపెట్టను, సంధ్యాకాలంలో నిద్రపోనివారు, తల్లిదండ్రులను, ఆచార్యులను గౌరవించేవారు, సంపదలకు అర్హులు. దానవులు భోగలాలసులై ఈ మర్యాదలన్నీ అతిక్రమించటంచేత వారి స్థానాలను నేను వదిలిపెట్టాను. ధర్మ, సత్య, శీలాదిసద్గుణాలను కలిగిఉన్న కారణంగా నిన్ను అనుగ్రహిస్తున్నాను. అన్న లక్ష్మీదేవి మాటలు విని ఇంద్రుడు ఆమెను పూజించాడు. ఈ వృత్తాంతము 'భారతం' శాంతి పర్వంలోనిది. పాలకులు, ప్రజలు భోగాలాలన వీడి నీతినియమాలతో జీవన విధానాన్ని అలవర్చుకోవడమే నిజమైన లక్ష్మీవ్రతం. మంచి లక్షణాల స్వరూపమే లక్ష్మీదేవి అనేది సారాంశం. పై ఇతివృత్తం ద్వారా భీష్ముడు ధర్మరాజుకు గొప్ప హితము బోధించాడు.

## వరాలతల్లీ 'వరలక్ష్మీ'

శ్రావణమాసంలో రెండవ శుక్రవారం వరలక్ష్మీ నామాంకితమైన శుభదినం. సిరిసంపదలను కాంక్షించే మానవులందరూ శ్రద్ధగా శ్రీమహాలక్ష్మీని విశేష పూజలతో, వ్రతాచరణతో మొక్కుకొనే చక్కని సందర్భం. లక్ష్మీ అంటే సిరిసంపదలే కాదు. కళలూ, కాంతులనూ, శోభనలనూ, సౌందర్యాన్ని, శుభాలను సూచిస్తుంది. వాటన్నింటికి వరలక్ష్మీదేవి అధిష్ఠానదేవత. ఆమె అష్టలక్ష్మీ స్వరూపిణీ. మనిషి యోగక్షేమాలకూ, సుఖజీవనానికీ, కావలసిన వనరులనూ ఎనిమిది భాగాలు చేస్తే అవన్నీ లక్ష్మీదేవి రూపాలే. "ఆదిలక్ష్మీ, ధాన్యలక్ష్మీ, ధైర్యలక్ష్మీ, గజలక్ష్మీ, సంతానలక్ష్మీ, విజయలక్ష్మీ, విద్యాలక్ష్మీ, ధనలక్ష్మీ" అని వరలక్ష్మీ తల్లి అష్టరూపాలు. ఆమెను పూజిస్తే అన్ని లభిస్తాయి. మనకే కాదు, ఆమె సమస్త దేవతా వనితలను వశంచేసుకున్న మహారాణి. బ్రహ్మకూ, ఇంద్రుడికీ, గంగాధరుడుకీ వైభవాన్నిచ్చేది వరలక్ష్మీ తల్లి కటాక్షమే. ఆ వరలక్ష్మీ దేవి పేరున ఉన్న వ్రతాన్ని ఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిర్మలమైన మనస్సు, నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాన్నిచేయడంవల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుంది. సకల శుభాలుకలుగుతాయి. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం తప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమే కాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించాలి. ఆ రోజున వీలుకాకపోతే తరువాత వచ్చే శుక్రవారాలలో కూడా ఈవ్రతాన్ని చేసుకోవచ్చు. వరలక్ష్మీ వ్రత కథలోని నాయిక చారుమతి. చారుమతి ఈ సులక్షణాల వల్లనే వరలక్ష్మీ కరుణకు నోచుకుందని పురాణ సందేశం. వరలక్ష్మీ వ్రతానికి ఆది దేవతయ్యోన లక్ష్మీదేవి ఒకనాటి రాత్రి సమయంలో చారుమతికి కలలో సాక్షాత్కరించింది. సువాసినులందరూ చేసే ప్రాభవ వ్రతం. 'శ్రీ వరలక్ష్మీ నమస్తు వసుప్రదే, సుప్రదే' శుక్రవారం రోజున జరుపుకునే వరలక్ష్మీ వ్రతంతో ధన, కనక, వస్తు, వాహనాది సమృద్ధులకు మూలం. శ్రావణ శుక్రవార వ్రతాలతో పాపాలు తొలిగి లక్ష్మీ ప్రసన్నత కలిగి లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుంది.



## వరలక్ష్మీ వ్రతం: పూజా విధానం..

## పాటించాల్సిన నియమాలు, తోరం, వ్రత కథ

శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రం శ్రావణం పేరుతో వచ్చే మాసం శ్రావణం. చాంద్రమాన ప్రకారం.. తెలుగు సంవత్సరాదిలో ఐదో నెల శ్రావణం. ఈ నెలలో నోములు, వ్రతాలు, పూజలకు ప్రశస్తి. భక్తితో వేడుకుంటే కోరిన వరాలను ప్రసాదించే కల్పవల్లి వరలక్ష్మీ దేవి. శ్రీమహావిష్ణువు దేవేరి లక్ష్మీదేవి అష్టావతారాలలో వరలక్ష్మీ ఒకరు. ఆ వరలక్ష్మీ దేవి పేరున ఉన్న వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిర్మలమైన మనస్సు, నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాన్నిచేయడంవల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుంది. సకల శుభాలుకలుగుతాయి. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం తప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

వరలక్ష్మీ పూజా సామగ్రి:

పసుపు, కుంకుమ, గంధం, విడిపూలు, పూల మాలలు, తమలపాకులు, 30 వక్కలు, ఖర్జూరాలు, అగరవత్తులు, కర్పూరం, చిల్లర పైసలు, తెల్లని వస్త్రం, రవికల గుడ్డ, మామిడి ఆకులు, ఐదు రకాల పండ్లు, అమ్మవారి ఫోటో, కలశం, కొబ్బరి కాయలు తెల్ల దారం లేదా నోము దారం, లేదా పసుపు రాసిన కంకణం, ఇంటిలో తయారుచేసిన నైవేద్యాలు, బియ్యం, పంచామృతాలు. దీపపు కుందులు, ఒత్తులు, నెయ్యి.

## వ్రత విధానం

వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించే రోజున ఉదయాన్నే లేచి తలస్నానం చేసి, ఇంటిని శుభ్రం చేసుకోవాలి. ఇంట్లోని పూజా మందిరంలో ఒక మండపాన్ని ఏర్పాటుచేసుకోవాలి. ఈ మండపం పైన బియ్యపు పిండితో ముగ్గువేసి, కలశం ఏర్పాటుచేసుకోవాలి. అమ్మవారి ఫోటో లేదా రూపును తయారుచేసి అమర్చుకోవాలి. పూజాసామగ్రి, తోరాలు, అక్షతలు, పసుపు గణపతిని ముందుగానే సిద్ధం చేసుకుని ఉంచాలి.

## వరమహాలక్ష్మీ అమ్మవారి కలశ స్థాపన, అలంకరణ

శ్రావణమాసం పేరు చెప్పగానే గుర్తువచ్చేది వరలక్ష్మీ వ్రతం. తెలుగు రాష్ట్రాల్లోని హిందువులు అందరూ ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. లేకపోతే ఎవరైనా చేస్తే వెళ్లి తీర్థప్రసాదాలు, శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం రోజున తెల్లవారుజామునే నిద్రలేచి, అభ్యంగన స్నానాన్ని ఆచరించాలి. ఇంటికి ఈశాన్య భాగంలో ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టి, మండపాన్ని ఏర్పాటుచేయాలి. మండపంలో బియ్యం పోసి అందంగా తీర్చిదిద్ది, అందులో కలశాన్ని ఉంచి, మర్రి, మామిడి, మేడి, జువ్వి, రావి చిగుళ్లను అందులో వేయాలి. కలశంపై కొబ్బరికాయ ఉంచి, ఎరుపు రంగు రవిక గుడ్డను దానికి అలంకరించాలి. తొలుత కొబ్బరికాయను నునుపుగా చేసి, ఎక్కువ వెడల్పు ఉండే భాగంలో అమ్మవారి ముఖాన్ని తయారుచేయాలి. ముఖం ఏర్పాటుచేసే భాగంలోనే పసుపును ముద్దలాచేసి కొబ్బరికాయకు అద్దాలి. తర్వాత కొద్దిగా పొడి పసుపును తీసుకుని దానిపై చల్లాలి. అనంతరం మైదా పిండి తీసుకుని, అందులో కొంచెం పసుపువేసి కలపాలి. ఈ ముద్దను వేలితో బలపంలా వత్తుకుని అమ్మవారికి చెవులు, ముక్కును తయారుచేయాలి. ముందు చెవులు, తర్వాత ముక్కును కొబ్బరికాయకు పసుపు అద్దిన భాగంలో ఉంచాలి. అనంతరం సన్నని అగ్గిపుల్లతో కళ్లను ముక్కుకు ఇరువైపులా మార్కింగ్ చేసుకోవాలి. కనుబొమలు కూడా గీసి, కను పాపలకు బియ్యపు పిండి, తర్వాత కాటుకను అద్దాలి. దీనిని పక్కన ఉంచి, కలశానికి ఓ పెద్ద చెంబును తీసుకుని దానికి మధ్యలో ఓ కర్రను కట్టాలి. మరో మర చెంబును తీసుకుని ఎడమవైపునకు ఎక్కువగా ఉండేలా మరో చిన్న కర్రను కట్టి, దాని చుట్టూ రవికల గుడ్డను చుట్టాలి. పెద్దదానిపై చిన్న మర చెంబును ఉంచి, చీరలో మూడో వంతు భాగాన్ని కుచ్చిళ్లుగా వేసి అలకరించాలి. తర్వాత చేతులను అమ్మవారికి అమర్చాలి. అభయ హస్తం కొద్దిగా వెనుక్కు, వరదహస్తం కొద్దిగా ముందుకు ఉండేలా చూసుకోవాలి. కలశంపై అమ్మవారు నిలబడటానికి వీలుగా బేబీ పిల్లోలా ఉండే ఆకారాన్ని ఉంచాలి. అమ్మవారి ముఖం కలశంపైకి ఉంచడానికి ముందే నగలను అలంకరించాలి. అమ్మవారి మెడలా వాటిపై చిన్న మట్టుగిన్నె ఉంచాలి. ఇది కంఠంలా ఉంటుంది కాబట్టి, కంఠాభారణం ఉంచాలి. తర్వాత చెవుపోగులు, ముక్కుపుడక ఉంచి, కలశంపై ముఖాన్ని ఏర్పాటుచేయాలి. తర్వాత బరువు తక్కువ ఉండే కిరీటం శిరస్సుపైన ఉంచాలి. తర్వాత వరలక్ష్మీదేవిని ఆవాహనం చేయాలి. వరలక్ష్మీని కీర్తిస్తూ ధ్యాన ఆవాహన షోడశోపచారాలు, అష్టోత్తరశత నామాలతో అర్చన చేయాలి. అమ్మవారిని అష్టోత్తర శత నామాలలో ఒక్కొక్క నామానికి ఓ విశిష్టత ఉంది. వేదాల్లో వీటికి సంబంధించి 108 కథలున్నాయి. బ్రహ్మ వైవర్త, విష్ణు, స్కంద, పద్మ, ఖాండ పురాణాల్లో లక్ష్మీదేవి వైభోగం, పూజాప్రాశస్త్యం గురించి పేర్కొన్నారు.

## తోరం తయారు చేసుకోవడం:

తెల్లటి దారాన్ని ఐదు లేక తొమ్మిది పోగులు తీసుకుని దానికి పసుపు రాయాలి. ఆ దారానికి ఐదు లేక తొమ్మిది పూలు కట్టి ముడులు వేయాలి. అంటే ఐదు లేక తొమ్మిది పోగుల దారాన్ని ఉపయోగించి, ఐదు లేక తొమ్మిదో పువ్వులతో ఐదులేక తొమ్మిది ముడులతో తోరాలను తయారుచేసుకుని, పీఠం వద్ద ఉంచి పుష్పాలు, పసుపు, కుంకుమ, అక్షతలు వేసి, తోరాలను పూజించి ఉంచుకోవాలి. ఆవిధంగా తోరాలను తయారుచేసుకున్న తరువాత పూజకు సిద్ధంకావాలి.

## తోరపూజ

తోరాన్ని అమ్మవారి వద్ద ఉంచి అక్షతలతో తోరపూజ మంత్రపఠనంతో పూజించాలి. ఆ శ్లోకం చదువుతూ తోరం కట్టుకోవాలి.

బద్నామి దక్షిణేహస్తే నవసూత్రం శుభప్రదం
పుత్రపౌత్రాభివృద్ధించ మమ సౌభాగ్యం దేహిమే రమే

## వరలక్ష్మీ వ్రత కథ

పూర్వం శౌనకాది మహర్షులను ఉద్దేశించి సూత మహర్షి ఇలా చెప్పారు. మునులారా! స్త్రీలకు సౌభాగ్యాన్ని ప్రసాదించే ఒక వ్రతాన్ని పరమ శివుడు పార్వతికి చెప్పారు. లోకోపకారం కోరి ఆ వ్రతాన్ని గురించి మీకు తెలియజేస్తాను .శ్రద్ధగా వినండి అన్నారు. పరమేశ్వరుడు ఒకనాడు తన భస్మసింహాసనంపై కూర్చుని ఉండగా నారదమహర్షి, ఇంద్రాది దిక్పాలకులు స్తుతి స్తోత్రాలతో ఆయను కీర్తిస్తున్నారు. ఆమహత్తర ఆనంద సమయంలో పార్వతీదేవి పరమేశ్వరుడ్ని ఉద్దేశించి ప్రాణేశ్వరా! స్త్రీలు సర్వసౌఖ్యాలు పొంది, పుత్ర పౌత్రాభివృద్ధిగా తరించుటకు తగిన వ్రతం ఒకదానిని చెప్పండి అని కోరింది. అందుకా త్రినేత్రుడు దేవీ! నీవు కోరినవిధంగా స్త్రీలకు సకల శుభాలు కలిగించే వ్రతం ఒకటి ఉన్నది. అది వరలక్ష్మీవ్రతం. దానిని శ్రావణమాసం రెండో శుక్రవారం నాడు ఆచరించాలని తెలిపాడు. అప్పుడు పార్వతీదేవి దేవా! ఈ వరలక్ష్మీ వ్రతాన్ని ఆదిదేవతలు ఎవరుచేశారు? ఈ వ్రతాన్ని ఎలా చేయాలో వివరంగా చెప్పండని కోరింది. కాత్యాయనీ పూర్వకాలంలో మగధ దేశంలో కుండినం అనే పట్టణం ఒకటి ఉండేది. ఆపట్టణం బంగారు కుడ్యములతో రమణీయంగా ఉండేది. ఆ పురంలో చారుమతి అనే ఒక బ్రాహ్మణ స్త్రీ ఉండేది. ఆమె సుగుణవతి. వినయ విధేయతలు, భక్తిగౌరవాలు గలయోగ్యురాలు. ప్రతిరోజూ ప్రాతఃకాలాన నిద్రలేచి భర్త పాదాలకు నమస్కరించి ప్రాతఃకాల గృహకృత్యాలను పూర్తిచేసుకుని అత్తమామలను సేవలో తరించేది.

## వరలక్ష్మీ సాక్షాత్కారం

వరలక్ష్మీ వ్రతానికి ఆదిదేవతయైన వరలక్ష్మీదేవి ఒకనాటి రాత్రి సమయంలో చారుమతికి కలలో సాక్షాత్కరించింది. ఓ చారుమతీ ఈ శ్రావణ పౌర్ణమి నాటికి ముందు వచ్చే శుక్రవారం నాడు నన్ను పూజించు... నీవు కోరిన వరాలు, కానుకలను ఇస్తానని చెప్పి అంతర్ధానమైంది. చారుమతి సంతోషించి. హే జననీ! నీకృపా కటాక్షాలు కలిగినవారు ధన్యులు. వారు సంపన్నులుగా, విద్వాంసులుగా మన్ననలు పొందుతారు. ఓ పావనీ! నా పూర్వజన్మ సుకృతం వల్ల నీ దర్శనం నాకుకలిగింది' అని పరిపరివిధాల వరలక్ష్మిని స్తుతించింది. అంతలోనే మేల్కొన్న చారుమతి అదంతా కలగా గుర్తించి తన కలను భర్తకు, అత్తమామలకు తెలియజేసింది. వారు చాలా సంతోషించి చారుమతిని వరలక్ష్మీవ్రతాన్ని చేసుకోమని చెప్పారు. పురంలోని మహిళలు చారుమతి కలను గురించివిని వారు కూడా పౌర్ణమి ముందు రాబోయే శ్రావణ శుక్రవారం కోసం ఎదురుచూడసాగారు. శ్రావణ శుక్రవారం రోజున పట్టణంలోని స్త్రీలందరూ ఉదయాన్నే లేచి తలారాస్నానం చేసి పట్టువస్త్రాలు ధరించి చారుమతి గృహానికి చేరుకున్నారు. చారుమతి తన గృహంలో మండపం ఏర్పాటుచేసి ఆ మండపంపై బియ్యంపోసి పంచపల్లవాలైన రావి, జువ్వి, మర్రి, మామిడి, ఉత్తరేణి మొదలైన ఆకులతో కలశం ఏర్పాటు చేసి వరలక్ష్మీదేవిని సంకల్ప విధులతో సర్వమాంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే! అంటూ ఆహ్వానించి ప్రతిష్ఠించింది. అమ్మవారిని షోడశోపచారాలతో పూజించి, భక్ష్య, భోజ్యాలను నివేదించారు. తొమ్మిది పోగుల తోరాన్ని చేతికి కట్టుకుని, ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. మొదటి ప్రదక్షిణ చేయగానే కాలి అందియలు ఘల్లుఘల్లున మోగాయి. రెండో ప్రదక్షిణ చేయగానే హస్తాలకు నవరత్నఖచిత కంకణాలు ధగధగ మెరవసాగాయి. మూడో ప్రదక్షిణ చేయగానే అందరూ సర్వాభరణభూషితులయ్యారు. వారు చేసిన వరలక్ష్మీ వ్రతం ఫలితంగా చారుమతి గృహంతో పాటు, ఆపట్టణంలో ఇతర స్త్రీల ఇళ్లు కూడా ధన, కనక, వస్తు వాహనాలతో నిండిపోయాయి. వారి వారి ఇళ్ల నుంచి గజ తరగరథ వాహనాలతో వచ్చి ఇళ్లకుతీసుకెళ్లారు. వారంతా మార్గమధ్యంలో చారుమతిని వేనోళ్ల పొగుడుతూ ఆమెకు వరలక్ష్మీ దేవి కలలో సాక్షాత్కరించి అనుగ్రహించగా ఆమె చేసిన వ్రతంతో తమని కూడా మహద్భాగ్యవంతులను చేసిందని ప్రశంసించారు. వారంతా ఏటా వరలక్ష్మీవ్రతం చేసి సకల సౌభాగ్యాలతో సిరిసంపదలుకలిగి, సుఖజీవనం గడిపి ముక్తిని పొందారు. మునులారా! శివుడుపార్వతికి ఉపదేశించిన ఈ వరలక్ష్మీవ్రత విధానాన్ని సవిస్తరంగా మీకువివరించాను. ఈ కథ విన్నా, ఈ వ్రతం చేసినా, ఈ వ్రతం చేసినప్పుడు చూసినా కూడా సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యాలు సిద్ధిస్తాయని సూత మహాముని శౌనకాది మహర్షులకు చెప్పారు. ఈ కథ విని అక్షతలు శిరసుపై వేసుకోవాలి. ఆ తరువాత ముత్తైదువులకు తాంబూలాలు ఇవ్వాలి. అందరికీ తీర్థప్రసాదాలు ఇచ్చి, పూజ చేసినవారు కూడా వాటిని తీసుకోవాలి. అమ్మవారికి పెట్టిన నైవేద్యాన్ని వాళ్లే ఆరగించాలి. రాత్రి ఉపవాసం ఉండి, భక్తితో వేడుకుంటే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. వరలక్ష్మీని పూజించడం చాలా శ్రేష్ఠం. శ్రీహరి జన్మ నక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే మాసంలో ఈ వ్రతాన్ని చేస్తే విశేష ఫలితాలు దక్కుతాయి. సర్వమంగళ సంప్రాప్తి, సకలాభీష్టం, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని మహిళలు ఈ వ్రతం చేస్తారు. వరలక్ష్మీ వ్రతంతో మనకు సర్వం ప్రాప్తిస్తాయి. శ్రీ (ధనం), భూ (భూమి), సరస్వతి (చదువు), ప్రీతి (ప్రేమ), కీర్తి, శాంతి, తుష్టి (సంతోషం), పుష్టి (బలం) కలుగుతాయి. నవకాయ పిండి వంటలు, ఫలాలను నైవేద్యంగా సమర్పించి, తొమ్మిది దారాలతో తయారు చేసిన తోరాన్ని అర్చించి, దాన్ని కుడిచేతికి కట్టుకోవాలి. భక్తితో ప్రదక్షిణపూర్వక నమస్కారాలు పూర్తిచేసి ఇంటికి వచ్చిన ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీర్వాదం తీసుకోవాలి. వరలక్ష్మీ తల్లి దీవెనలతో ఆరోగ్య ఐశ్వర్యాల అభివృద్ధితో సర్వమానవాళి వర్ధిల్లుగాక!

సర్వేజనాః సుఖినోభవంతు.



-శారద శృంగేరి
9490 26 1119

# చేనేత వస్త్రాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక...



కరీంనగర్, ఆగస్టు 7: (నేటినిజం ప్రతినిధి) సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర...చేనేత వస్త్రాలు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని , చేనేత పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక లాంటిదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి , సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు గురువారం రోజున తిమ్మాపూర్ బిజెపి మండల శాఖ ,బిజెపి నేత మాజీ జెడ్పిటిసి ల ఆధ్వర్యంలో మండలంలోని పచ్చునూర్ , తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహించారు. అనంతరం మండల కార్యాశాల , తిరంగా అభియాన్ ప్రోగ్రాం కు సంబంధించిన సన్నాక సమావేశం జరిగింది. ఆయా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ భారతదేశంలో చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి , చేనేత కార్మికులను గౌరవించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.

ముఖ్యంగా 1905 లో బ్రిటిష్ ఉత్పత్తులను బహిష్కరించడం ద్వారా స్వదేశీ ఉద్యమం ప్రారంభమైందన్నారు. ప్రధానంగా ఈ ఉద్యమం దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం , స్థానిక చేనేత పరిశ్రమను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలతో ముందుకు కొనసాగిందన్నారు. భారత్లో చేనేత రంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని , గ్రామాల్లో వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభాకు ఈ రంగమే ఉపాధి కల్పిస్తుందన్నారు. చేనేత పరిశ్రమతో ఎన్నో కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధి కోసం, కార్మికుల సంక్షేమం కట్టుబడి పని చేస్తుందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

తిరంగా అభియాన్ ప్రోగ్రామ్ ను సక్సెస్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ తో దేశ ఖ్యాతినీ విశ్వానికి చాటి చెప్పడం జరిగిందన్నారు. భారతదేశ శక్తి సామర్థ్యాలు నేడు ప్రపంచ దేశాలు గుర్తించాయని , , దేశంలో ఉండే కాంగ్రెస్ , ఇతర ప్రతిపక్ష పార్టీలకు మాత్రం గుర్తించడం లేదని , ఆపరేషన్ సింధూరపై పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తూ దేశాన్ని కించపరిచేలా వ్యవహరించడం దౌర్భాగ్యమన్నారు . బిజెపి నాయకులు కార్యకర్తలు తిరంగా అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా దేశ , త్రివిధ దళాల శక్తిసామర్థ్యాలు , గొప్పతనాన్ని ప్రజలందరికి వివరించేలా, వాడ వాడలా త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలన్నారు. జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా తిమ్మాపూర్ , పచ్చునూరు గ్రామాలలో పలువురు చేనేత వృత్తిదారులు, కార్మికులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి , మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగిరెడ్డి,మాజీ ఎంపీటీసి ఒడ్డె రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి,రాష్ట్ర నాయకులు పుప్పాల రఘు, జిల్లా ఈసి సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి,తమ్మనవేణి రాజు యాదవ్,బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శులు బుర్ర శ్రీనివాస్ గౌడ్,కానుగంటి మధుకర్ రెడ్డి,రామిడి మహేందర్ రెడ్డి, ఉప్పులేటి జీవన్,వీణవంక అంజి,ఈగ వెంకటేశం, అందె శేఖర్,చేనేత సంఘం నాయకులు అడిచర్ల రవి, లక్ష్మణ్,విన్క భూవేష్,రాజ్ కుమార్,బండి స్వామి,కాల్వ శ్రీనివాస్, మల్లేశం గౌడ్,మహేష్,కామెర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీయూలో విద్యార్థుల ఆందోళన

నల్గొండ, ఆగష్టు 7: నల్లగొండ లోని మహాత్మాగాంధీ యూనివర్శిటలో గురువారం విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. అటెండెన్స్ లోపం కారణంగా పలువురు విద్యార్థులను డిటెండ్ చేసిన యూనివర్సిటీ చర్యను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆర్ట్స్ కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వైస్ ఛాన్సలర్ విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు వీసీ చొరవ తీసుకోవాలన్నారు

## మహిళ పట్ల ఫోన్ లో అసభ్యకరంగా వ్యవహరించిన వ్యక్తి రిమాండ్ కి తరలింపు




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 7: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి ఒక మహిళ పట్ల ఫోన్ అసభ్యకరంగా మాట్లాడటం, వేధించటం వంటి చర్యల కారణం గా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించటం జరిగింది అని వేములవాడ రూరల్ ఎస్ ఐ అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ ఐ అంజయ్య మాట్లాడుతూ మహిళల పట్ల అసభ్యకరం గా వ్యవహరించిన మహిళల ను శారీరకంగా మానసికంగా హింసించిన, ఫోన్ ద్వారా గాని సోషల్ మీడియా ద్వారా గాని మహిళల ను వేధించిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం అని మహిళ లు వారి పై జరుగుతున్న చర్యలు మౌనంగా భరించద్దు అని ధైర్యం గా ముందు కు వచ్చి సంబంధిత పోలీస్ స్టేషన్లో కానీ జిల్లా షీ టీమ్ కి గాని సంప్రదించాలి అని బాధిత మహిళ వివరాలు గోప్యం గా ఉంచుతాం అని సూచించారు.

## అల్ఫోర్స్ హైస్కూల్ లో ఉత్కంఠ భరితంగా టేబుల్ టెన్నిస్ పోటీలు




కరీంనగర్, ఆగష్టు 7: (నేటినిజం ప్రతినిధి) క్రీడల ద్వారా విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని, విజయం సాధించడానికి ఆసక్తి పెంపొందించవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హైస్కూల్ (సిబిఎస్ఇ) ప్రాంగణంలో నిర్వహిస్తున్నటువంటి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఉద్దేశించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న ప్రారంభించినటువంటి టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నదని తెలిపారు. వివిధ పాఠశాల నుంచి విచ్చేసినటువంటి క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి చాటుతూ క్రీడా రంగానికి వన్నెతెస్తున్నానని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వారు తెలిపారు. ఈ క్రమంలో రెండో రోజులో భాగంగా నిర్వహించేటువంటి టీం ఈవెంట్లలో అండర్ 14 బాలికల విభాగంలో టీం ఈవెంట్లో విపిఎస్ పబ్లిక్ స్కూల్ టైం స్కూల్ పై ఒక పాయింట్ తేడాతో గెలిచింది.అండర్ 17 విభాగంలో శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ 3-0 పాయింట్లతో సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ పై గెలిచింది. అండర్ 19 విభాగంలో ప్రకాష్ సీనర్జీ పాఠశాల సర్ సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ పై 0-3 పాయింట్ల తేడాతో గెలిచింది.

## గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు : ఎంపీడీవో యాకూబ్ నాయక్

నల్లగొండ ఆగస్టు 07 : గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, మురుగు కాల్వల చివరలో విధిగా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని నల్లగొండ మండల ఎంపీడీఓ యాకూబ్ నాయక్ సిబ్బందికి సూచించారు. గురువారం నల్లగొండ మండలంలోని జీకే అన్నారం, కాకుల కొండారం, రాములబండ గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలకు స్థలాలను పరిశీలించడంతో పాటు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో పురోగతిని పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ రమేశ్, పంచాయతీ కార్యదర్శులు యశ్వంత్ సాయి, బైరెడ్డి హరిత, మమత ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.